భారత
కమ్యూనిస్టు పార్టీ
(మార్క్సిస్టు)

# కొన్ని రాజకీయ పరిణామాలపై నివేదిక

*(2022, అక్టోబర్ 29-30 తేదిల్లో జరిగిన కేంద్రకమిటీ సమావేశంలో ఆమోదించబడినది)*

ప్రచురణ : భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్రప్రదేశ్ కమిటీ

**ప్రథమ ముద్రణ** : నవంబర్, 2022

**ప్రతులు** : 1000

వెల : ₹. 15/-

**ప్రతులకు**

PSBH

**ప్రజాశక్తి బుక్‌హౌస్**

27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట,

విజయవాడ -2, ఫోన్ : 0866 -2577533

**బ్రాంచీలు**

విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, కాకినాడ,

ఏలూరు, విజయనగరం, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం

**ముద్రణ**

ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, విజయవాడ

website : www.psbh.in

prajasaktipublishinghouse@gmail.com

# భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)

## కొన్ని రాజకీయ పరిణామాలపై నివేదిక
## (2022, అక్టోబర్ 29-31 తేదీల్లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశంలో ఆమోదించబడినది)

### అంతర్జాతీయ పరిణామాలు

2022 జులైలో జరిగిన కేంద్ర కమిటీ సమావేశం తరువాత సంభవించిన కొన్ని ప్రధానమైన పరిణామాలను గురించి ఈ నివేదికలో ఇవ్వడం జరిగింది.

#### ప్రపంచ ఆర్థిక సంక్షోభం

ప్రపంచ ఆర్థిక సంక్షోభం మరింత తీవ్రమవుతోంది. 2022 అక్టోబర్‌లో వెలువడిన ఐఎంఎఫ్ ప్రపంచ ఆర్థిక నివేదిక ఇలా చెప్పింది : "ప్రపంచ అభివృద్ధి 2021లో 6.0 శాతం నుండి 2022లో 2.7 శాతానికి, 2023లో 2.7 శాతానికి తగ్గిపోయినట్లు అంచనా. ప్రపంచ ద్రవ్య సంక్షోభం, కోవిడ్-19 మహమ్మారి సమయంలో మినహా 2001 తరువాత ఇదే అత్యంత బలహీనమైన అభివృద్ధి.

2023 అక్టోబర్ నాటికి అమెరికాలో మాంద్యం రావడం 100 శాతం జరగవచ్చునని బ్లూమ్‌బెర్గ్ అర్థిక నమూనా సరికొత్తగా అంచనా వేసింది.

ధనిక దేశాల ప్రవర్తన వల్ల ప్రపంచం ఆర్థిక మాంద్యంలోకి జరుకుంటున్నదనీ, దాని వల్ల కరోనా మహమ్మారికన్నా ఘోరమైన నష్టం జరుగుతుందనీ ఐక్యరాజ్య

సమితి అక్టోబర్ 3న హెచ్చరించింది. ఓయిసిడి దేశాల కూటమి కూడా ఇదే విధమైన అంచనాలు వేసింది. ఈ కూటమి 2023లో తమ దేశాల అభివృద్ధిని 2.8 శాతం నుండి 2.2 శాతానికి తగ్గించుకుంది. దానర్థం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు 2.8 లక్షల కోట్ల డాలర్ల నష్టం సంభవిస్తుందన్నమాట.

ఆహారం, పెట్రోల్ ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో ప్రపంచ దేశాలన్నిటి కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లు పెంచాల్సి వచ్చింది. ప్రపంచ ద్రవ్యోల్బణం 2021లో 4.7 శాతం నుండి 2022లో 8.8 శాతానికి పెరుగుతుందని అంచనా. ప్రపంచంలోనే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన అమెరికా మార్చి నెలలో వడ్డీ రేట్లు పెంచడం ప్రారంభించింది. అమెరికా ఫెడరల్ బ్యాంకు వరుసపెట్టి ఐదు సార్లు వడ్డీ రేట్లు పెంచింది.

## ఉక్రెయిన్ యుద్ధం

మన పార్టీ 23వ మహాసభ రాజకీయ తీర్మానం ఇలా పేర్కొంది: ఉక్రెయిన్ అనేది రష్యాకూ, పశ్చిమ దేశాల సైనిక కూటమి అయిన నాటోకూ మధ్య యుద్ధ కారకంగా మారింది." అమెరికా, నాటోలు ఉక్రెయిన్‌కు పెద్ద ఎత్తున సైనిక సహాయం చేస్తున్నందున యుద్ధం కొనసాగుతోంది. నిజానికి మనం ఇదివరకే చెప్పినట్లు ఇప్పుడు జరుగుతున్నది ఉక్రెయిన్ క్షేత్రంలో రష్యాకూ, అమెరికా - నాటోలకూ మధ్య యుద్ధం.

ఉక్రెయిన్ రక్షణ, సైనిక అవసరాలను అత్యవసరంగా తీర్చేందుకు గాను 72 కోట్ల డాలర్ల విలువైన భద్రతా సహాయాన్ని తీసుకునేందుకు అమెరికా అధ్యక్షునికి అధికారమిస్తూ అమెరికా రక్షణ శాత 2022 అక్టోబర్ 14న తీర్మానించింది. 2021 ఆగస్టు నుండి 23 సార్లు రక్షణ శాఖ నిల్వల నుండి ఉక్రెయిన్‌కు ఆయుధాలు సరఫరా చేయడానికి జో బైడెన్ ప్రభుత్వానికి అనుమతులు లభించాయి. బైడెన్ ప్రభుత్వం ప్రారంభమైనాక ఇప్పటి వరకు అమెరికా ఉక్రెయిన్‌కు 1,830 కోట్ల డాలర్ల సైనిక సహాయం అందించింది. ఇది కాకుండా అమెరికా తన నాటో కూటమి సభ్యులు, ఇతర మిత్రుల నుండి అదనంగా ఉక్రెయిన్‌కు సహాయాన్ని సేకరించింది. అణ్వస్త్రాలు, 'డర్టీ బాంబులు' ఉపయోగిస్తామన్న హెచ్చరికలు పరిస్థితిని ప్రమాదరకంగా మార్చేస్తున్నాయి.

**ఆంక్షలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం :** అమెరికా, జి-7, ఐరోపా యూనియన్‌లు రష్యాపై తీవ్రమైన ఆంక్షలు విధించాయి. ఫలితంగా రష్యా నుండి అవసరమైన లోహాలు, ఖనిజాల ఎగుమతుల్లో కోత పడింది. ఆహార సరఫరాలు,

ఇంధనం కొరత ఏర్పడింది. ద్రవ్యోల్బణం పెరిగిపోతున్నది. రష్యాపై ఆంక్షల వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు అతి పెద్ద ఇంధన సరఫరా షాక్ తగలబోతున్నది. ఈ యుద్ధ పర్యవసానాలను ఐరోపా యూనియన్ పెద్ద ఎత్తున ఎదుర్కొంటున్నది. అక్కడ ద్రవ్యోల్బణం తీవ్రంగా పెరుగుతోంది. తీవ్రమైన ఇంధన సంక్షోభం ఏర్పడింది.

రష్యాపై చమురు ఆంక్షల ప్రభావం ఇప్పటి వరకు పరిమితంగానే వెల్లడయింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపైనా, అనేక దేశాల ఇంధన భద్రతపైనా దీని ప్రభావం ముందు ముందు మరింత తీవ్రంగా ఉంటుంది.

**నార్డ్ స్ట్రీమ్ పరిణామాలు :** ఇటీవల నార్డ్ స్ట్రీమ్ పైప్‌లైన్‌లో వరుస పేల్లు, లీకేజీలకు కారణమెవరో తెలుసునని జర్మనీ చెప్పింది. అయితే జాతీయ భద్రతకు నష్టం జరుగుతుంది గనుక దాని గురించి మాట్లాడబోనని పేర్కొంది. ఈ విషయంలో తన వద్ద నున్న సమాచారాన్ని ఇతర దేశాలతో చెప్పడానికి స్వీడన్ కూడా ఇష్టపడలేదు. ఇది చాలా సున్నితమైన విషయం అని అది వాదిస్తోంది.

బాగా పనిచేస్తున్న నార్డ్ స్ట్రీమ్ 2 నుండి ఈ శీతాకాలంలో యూరప్‌కు 2750 కోట్ల క్యూబిక్ మీటర్ల గ్యాస్ సరఫరా చేస్తానని రష్యా చేసిన ప్రతిపాదనకు జర్మన్ ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందన రాకపోవడంతో రష్యా అధ్యక్షుడు పుతిన్ టర్కీకి కొత్త గ్యాస్‌పైపు లైన్ నిర్మిస్తానని ప్రతిపాదించారు. దీంతో అమెరికా దాని మిత్రులకు దిమ్మతిరిగింది. అనేక దేశాల్లోని ప్రత్యేక ఆర్థిక మండళ్ల (ఇఇజెడ్)లో ప్రమాదాల నుండి తప్పించుకోడానికి రష్యాకు ఇది సహాకరిస్తుంది.

ప్రపంచానికి రష్యా చమురు ఎగుమతులు పెరుగుతూనే ఉన్నాయి. ఐరోపా యూనియన్ రష్యాపై ఆధారపడ్డం కొనసాగిస్తూనే ఉంది. రష్యా చమురు ఎగుమతులపై ఆంక్షలు డిసెంబర్ 5 నుండి అమలులోకి రావాలని నిర్ధేశించారు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి ఏడు మాసాలుగా రష్యా రోజుకు 34 లక్షల బారెళ్ల చొప్పున ముడిచమురును ఎగుమతి  చేసిందని కెప్లెర్ గణాంకాలు తెలిపాయి. 2021లో ఇదే కాలంతో పోలిస్తే ఇది 17 శాతం అధికం.

ఈ పూర్వ రంగంలో రోజుకు 20 లక్షల బ్యారెళ్ల చమురు ఉత్పత్తిని తగ్గించేయాలని ఒపెక్ దేశాలు నిర్ణయించడంతో ప్రపంచ చమురు ధరలు పెరిగిపోతున్నాయి. ఇది అమెరికా, సౌదీ అరేబియాల మధ్య బెడిసికొడుతున్న సంబంధాల సమస్యను ముందుకుతెచ్చింది.

**పార్టీ 23వ మహా రాజకీయ తీర్మానం పేర్కొన్నట్లు :** "ఈ యుద్ధం తక్షణం ఆగిపోవాలి, పరిష్కారించుకోవాల్సిన అంశాలు ఏమైనా ఉంటే చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి." అమెరికా, నాటోలు తూర్పు వైపు నాటో విస్తరణను ఆపేయాలి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను నాశనం చేస్తున్న ఆంక్షలను ఎత్తివేయాలి.

## ఆందోళనకరంగా మారుతున్న జీవన పరిస్థితులు

ప్రపంచ ఆర్థిక సంక్షోభం, ఉక్రెయిన్ యుద్ధం ప్రజల జీవన పరిస్థితులను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి.

ప్రపంచ వ్యాపితంగా ఆయా దేశాల్లో ఆహారం ధరలు ఎన్నడూ లేనంత తీవ్ర స్థాయికి పెరిగిపోయాయి. తక్కువ ఆదాయం, మధ్య ఆదాయం గల దాదాపు అన్ని దేశాల్లోనూ ద్రవ్యోల్బణం తీవ్రంగా పెరిగిందని 2022 మే, సెప్టెంబర్ మధ్య ప్రపంచ బ్యాంకు గణాంకాలు తెలుపుతున్నాయి. 88.9 శాతం తక్కువ ఆదాయ దేశాల్లో, 91.1 శాతం దిగువ మధ్య తరగతి ఆదాయ దేశాల్లో ద్రవ్యోల్బణం పెరిగింది. 95 శాతం ఎగువ మధ్యతరగతి దేశాల్లో ద్రవ్యోల్బణం 5 శాతానికి మించి పెరిగింది. అధిక ఆహార ధరలు ప్రపంచ వ్యాపితంగా పెద్ద సంక్షోభాన్ని సృష్టించాయి. దీని వల్ల కోట్లాది మంది ప్రజలు నిష్ట దారిద్ర్యంలోకి జారిపోతున్నారు. ఆకలి, పౌష్టికాహార లోపం పెరుగుతున్నాయి. 2022 అక్టోబర్‌లో గోదుమ, మొక్కజొన్న, వరిధాన్యం ధరలు 2021 అక్టోబర్‌తో పోలిస్తే వరుసగా 18, 27, 10 శాతం చొప్పున పెరిగాయి. ఆహారం, ఎరువుల ధరలు పెరిగిపోవడం వల్ల తీవ్రమైన ఇబ్బందులపాలైన 48 దేశలను ఆదుకోడానికి 500 నుండి 700 కోట్ల డాలర్ల సహాయం అవసరమని ఐఎంఎఫ్ చెప్పింది. దీనికి తోడు రానున్న 12 మాసాల్లో తీవ్రమైన ఆహార కొరతను అదిగమించేందుకు మరో 5000 కోట్ల డాలర్లు అవసరం. 53 దేశాలు, ప్రాంతాల్లోని 22.2 కోట్ల మంది ప్రజలు ఆహార కొరతను ఎదుర్కొంటారనీ, వారికి తక్షణ సాయం అవసరమని ఐక్యరాజ్య సమితికి చెందిన ఆహార, వ్యవసాయ సంస్థ (ఫావో) చెప్పింది.

## ప్రపంచ వ్యాపిత నిరసనలు

ద్రవ్యోల్బణం పెరిగిపోతుండడంతో కార్మికుల కొనుగోలు శక్తి పడిపోతున్నది. దాంతో ప్రంచంవ్యాపితంగా వివిధ రంగాలకు చెందిన ట్రేడ్‌యూనియన్లు ఇటీవలి వారాల్లో సమిష్టిగా సమ్మెకు వెళ్లాలని నిర్ణయాలు తీసుకుంటున్నాయి. వేతనాల పెంపుదలతోపాటు పరిపరిస్థితులు మెరుగుపడాలనీ, పెన్షన్ హక్కులు పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇయ దేశాల్లో కార్మికుల మరింత దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. దాంతో ఆయా దేశాల్లో ఒకే రంగంలో అనేక సమ్మెలు జరుగుతున్నాయి.

**బ్రిటన్‌లో నిరసనలు:** జీవన వ్యయం పెరుగుదలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరుతూ బ్రిటన్‌లో లక్షలాది మంది కార్మికులు ఇటీవలి మాసాల్లో సమ్మె పోరాటాల్లోకి దిగారు. ఇక్కడ ద్రవ్యోల్బణం 10 శాతానికి పెరిగింది. 40 ఏళ్లలో ఇదే

అత్యధికం. తమ వేతనాల పెరుగుదల కన్నా జీవన వ్యవయం పెరుగుదల వేగంగా ఉందని కార్మికులు గ్రహించారు. కొన్ని రంగాల్లో కార్మిక సంఘాలు వేతన ఒప్పందాలు కుదుర్చుకుంటున్నప్పటికీ ఆ పెరుగుదల జీవన వ్యయం పెరుగుదల కన్నా తక్కువగా ఉంటోంది. 2019లో దేశంలో సమ్మెల వల్ల నెలకు సగటున 19,500 దినాలు కోల్పోగా, 2022లో 87,600 దినాలు కోల్పోయినట్లు జాతీయ గణాంకాల కార్యాలయం వివరాలు తెలియజేస్తున్నాయి.

జూన్ నుండి రైల్వేల్లో వరుసగా సమ్మెలు జరుగుతున్నాయి. దాంతో దేశంలోని రైల్వే వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది.

ఆగస్టు నుండి రాయల్ మెయిల్ కార్మికులు పెద్ద ఎత్తున సమ్మెలు చేశారు. ఈ సమ్మెలో కమ్యూనికేషన్స్ వర్కర్స్ యూనియన్‌కు చెందిన 1,15,000 మంది కార్మికులు పాల్గొన్నారు.

బిటి, ఓపెన్‌రీచ్‌లలో 40,000 కార్మికులు అక్టోబర్‌లో దాని చరిత్రలోనే తొలిసారి సమ్మెలోకి వెళ్లారు.

తాము ప్రాతినిధ్యం వహిస్తున్న క్లయింట్స్ దగ్గర నుండి మరింత ఎక్కువ ఫీజు కోసం జూన్ నుండి ఇంగ్లండు, వేల్స్‌లోని క్రిమినల్ కేసులు వాదించే న్యాయవాదులు సమ్మె చేశారు. దాంతో వేలాది విచారణలు ఆలస్యమైపోయాయి.

వేతనాలు, పెన్షన్ల కోసం యూనివర్సిటీలు, కళాశాలల యూనియన్‌కు చెందిన 70,000 మంది ఉద్యోగులు 150 విశ్వవిద్యాలయాల్లో సమ్మెకు అనుకూలంగా ఓటు వేశారు. టీచర్స్ యూనియన్, ఆరోగ్య కార్మికులు, చమురు, సహజవాయువు ఇతర రంగాల్లో సమ్మె పిలుపులు ఇచ్చారు.

అక్టోబర్ 19–21 తేదీల్లో నెదర్లాండ్స్‌లోని బస్ కార్మికులు వేతనాలు, పెన్షన్ల కోసం మూడు రోజులు సమ్మె చేశారు.

స్విట్జర్లాండులోని నిర్మాణ కార్మికులు వేతనాల పెంపు, కొత్త టైమ్ షెడ్యూల్, పని భద్రతలతో కూడిన కొత్త కాంట్రాక్టు కుదుర్చుకోవాలని కోరుతూ అక్టోబర్ 17న సమ్మె చేశారు.

పెరుగుతున్న జీవన వ్యయాలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరుతూ ఫ్రెంచ్ కార్మికులు దేశ వ్యాపిత సమ్మె చేశారు. ఫ్రాన్స్‌లోని ప్రధాన చమురు రిఫైనరీలో ప్రారంభమైన నిరసన కార్యక్రమాలు త్వరలోనే రవాణా రంగం, పాఠశాలలు, ఆరోగ్య రంగం, సివిల్ సర్వీసులు, ఇంధనం ఇతర రంగాలకు వ్యాపించాయి.

విపరీతంగా పెరుగుతున్న జీవన వ్యయాల సమస్య, వాతావరణ సమస్యలు పరిష్కరించడంలో ఇమ్మాన్యుయేల్ మాక్రన్ ప్రభుత్వ వైఫల్యానికి నిరసనగా అక్టోబర్

16న పారిస్‌లో లక్ష మందికి పైగా ప్రజలు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన చేశారు. ఇటీవల ఏర్పడిన వామపక్ష కూటమి న్యూ ఇకలాజికల్ అండ్ సోషల్ పీపుల్స్ యూనియన్ (నూపెస్) దాంతో పాటు ఫ్రెంచ్ కమ్యూనిస్టు పార్టీ (పిసిఎఫ్), లా ఫ్రాన్స్ ఇన్సౌమైజ్ ఇంకా జనరల్ కాన్ఫడెరేషన్ ఆఫ్ లేబర్ (సిజిటి) వంటి కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు ఈ ప్రదర్శనలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సైప్రస్ కార్మికులు ద్రవ్యోల్బణం అదుపుచేయడానికి నిర్దిష్ట చర్యలు తీసుకోవాలనీ, పెరిగిపోతున్న జీవన వ్యయాల సమస్యను పరిష్కరించాలని కోరుతూ అక్టోబర్ 15న నికోసియాలో ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యాలయానికి ప్రదర్శన నిర్వహించారు.

బెల్జియమ్ వర్కర్స్ పార్టీ (పిటిబి–పిబిడిఎ) ప్రతి శుక్రవారం రేజ్ ర్యాలీల పేరుతో ప్రదర్శనలు నిర్వహిస్తుంటుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఆ పార్టీ కార్యకర్తలు అక్టోబర్ 14న దేశంలోని వ్యాపారవేత్తలు ఈ కాలంలో గడించిన విపరీతమైన లాభాలపై పన్ను వేయాలని కోరుతూ బ్రస్సెల్స్‌లోని ఎంగీ కార్యాలయం ఎదుట ప్రదర్శన నిర్వహించారు.

అమెరికాలో జీవన వ్యయాలు పెరుగుతున్నందున ప్రతి కుటుంబం మీద నెలకు 460 డాలర్ల అదనపు భారం పడుతోంది. దీనికి నిరసనగా కార్మిక వర్గం అనేక నిరసన కార్యక్రమాలు నిర్వహించింది. అమెరికా చరిత్రలోనే అతి పెద్ద ప్రయివేటు ఆరోగ్య సంరక్షణ కార్మికుల ప్రదర్శన మిన్నెసొటాలో జరిగింది. ఇందులో 15,000 మంది నర్సులు పాల్గొన్నారు. సియాటెల్‌లో 6,000 మంది ఉపాధ్యాయులు పనిమానేసి సమ్మె చేశారు. లక్ష మందికి పైగా రైల్ రోడ్డు కార్మికుల సమ్మె చేశారు.

వేతనాలు, పెన్షన్లు పెంచాలనీ, విద్యుత్, ఇంధనం, ఆహారం ధరలు తగ్గించాలనీ, పన్నులు రద్దు చేయాలనీ, నిత్యావసర వస్తువుల ధరలపై కోత విధించాలనీ, కొన్ని వస్తువుల గరిష్ట ధరలు పెంచకుండా పరిమితి విధించాలనీ, రుణాలు రద్దు చేయాలనీ కోరుతూ గ్రీస్‌లో పెద్ద పెద్ద ప్రదర్శనలు జరిగాయి. నవంబర్ 9న సార్వత్రిక సమ్మె జరపాలని ట్రేడ్ యూనియన్లు, ఇతర ప్రజా సంఘాలు పిలుపునిచ్చాయి.

యూరప్‌లోని జర్మనీ, జెక్ రిపబ్లిక్, హంగరీ, మాల్డోవా, ఆఫ్రికాలోని ట్యునీషియా, గినియా, దక్షిణాఫ్రికా, కీన్యా, సూడాన్, మధ్య ఆఫ్రికా ప్రాంతం, లాటిన్ అమెరికాలోని ఈక్వెడార్, అర్జెంటీనాల్లో ఇటువంటి కార్మిక వర్గ నిరసన కార్యక్రమాలు జరిగాయి.

పైన పేర్కొన్న సమ్మె పోరాటాలు  జరిగిన వాటిలో కొన్ని మాత్రమే. జీవన వ్యయాలు విపరీతంగా పెరిగిపోతున్నందున ప్రపంచ వ్యాపితంగా అనేక దేశాల్లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయి.

**ఇరాన్:** మహిళా హక్కులపై జరుగుతున్న దాడికి వ్యతిరేకంగా ఇరాన్‌లో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. దిగజారిపోతున్న ఆర్థిక పరిస్థితులను తాళలేని  అనేక మంది కూడా ఈ ప్రదర్శనల్లో చేరుతున్నారు. ఈ నిరసన పోరాటాలను పరమ కిరాతకంగా అణచివేస్తున్నారు. ఫలితంగా అనేక మంది ప్రజల ప్రాణాలు పోయాయని వార్తలు వస్తున్నాయి.

**పాలస్తీనా:** పశ్చిమ తీరం, ఆక్రమిత ప్రాంతాల్లోని పాలస్తీనియన్లపై కిరాతకమైన అణచివేత కొనసాగుతోంది. ఈ ఏడాది ఇప్పటి వరకు ఇజ్రేలీ భద్రతా దళాలు 184 మంది పాలస్తీనియన్ల ప్రాణాలు తీశారు. ఇటీవల గాజాలో జరిగిన దాడులను మరువక ముందే ఇజ్రేలీ అధికారులు పశ్చిమ తీరంలోని పాలస్తీనా మానవహక్కుల రక్షణ కార్యకర్తలు, పౌరహక్కుల పరిరక్షకులపై దాడులు పెంచారు. వీటిలోని అనేక సంస్థలను ఇటీవలి కాలంలో ఏకపక్షంగా నిషేధించారు. ఇజ్రాయిల్ ప్రభుత్వం అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తూ, కోట్లాది మంది పాలస్తీనియన్ల పట్ల వివక్ష ప్రదర్శిస్తోంది. దౌర్జన్యాలు చేస్తున్నది. వీటిని ఎవరూ ప్రశ్నించే వారిపై అది ఈ రకమైన దాడులు, దౌర్జన్యాలు చేస్తున్నది. పాలస్తీనా ప్రాంతాల అక్రమ ఆక్రమణ, యూదు వలసల ఏర్పాటును ఇంకా విస్తరిస్తూనే ఉన్నారు.

## ఎన్నికలు

ఇటీవల అనేక దేశాల్లో వెలువడిన ఎన్నికల ఫలితాలు మనపార్టీ 23వ మహాసభలో చెప్పినట్లే రాజకీయంగా మితవాత మొగ్గును చూపిస్తున్నాయి. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగకపోవడం దీంతో పాటు ఇటు సోషల్ డెమోక్రాట్లు, అటు కన్సర్వేటివ్ పార్టీల ఆర్థిక విధానాల వైఫల్యాలు ప్రజల్లో అసంతృప్తిని తీవ్రంగా పెంచుతున్నాయి. అనేక దేశాల్లో పచ్చి–మితవాద శక్తులు మతపరమైన నమ్మకాలనూ, జాత్యహంకారాన్ని ఉపయోగించుకుని ముందడుగు వేస్తున్నాయి.

**ఇటలీ:** ఇక్కడ బ్రదర్స్ ఆఫ్ ఇటలీ పార్టీ అధ్యక్షురాలు, పచ్చిమితవాద నాయకురాలు అయిన జార్జియా మెలోనీ నేతృత్వంలోని పచ్చి–మితవాద కూటమి 44 శాతం ఓట్లు గెలుచుకుని ఇటాలియన్ పార్లమెంటు ఎన్నికల్లో విజయం సాధించింది. ఆమె కూటమిలో మాజీ ప్రధాన మంత్రి సిల్వియో బెర్లుస్కోనీ

నాయకత్వంలోని ఫోర్జా ఇటాలియా, మట్టియో సాల్విని నేతృత్వంలోని వలసకార్మిక వ్యతిరేక లీగ్‌లు భాగస్వాములుగా ఉన్నాయి. ఫాసిస్టు నియంత బెనిటో ముస్సోలినీ తరువాత ఇటలీలో ఏర్పడిన తొలి పచ్చి-మితవాద ప్రభుత్వం ఇది. మెలోని వలసలను తీవ్రంగా వ్యతిరేకించారు, పాతకాలపు 'కుటుంబ విలువలు'ను సమర్థించారు. ఆమె అమెరికాకు బాగా అనుకూలమైన వ్యక్తి. అణచివేతతో కూడిన జాతీయ భద్రతా విధానాలుండాలంటారు. ఆమె టీనేజ్ బాలికగా ఉండగానే నయా-ఫాసిస్టు ఇటాలియన్ సామాజికోద్యమంలో కర్యకర్తగా రాజకీయ అరంగేట్రం చేశారు. ఇటలీ ప్రభుత్వం విపరీతమైన అప్పుల్లో కూరుకుపోయి ఉంది. జిడిపిలో దాని అప్పు 135 శాతం ఉ ంది. అంతర్జాతీయంగా వడ్డీ రేట్లు పెరిగిపోతుండడంతో దాని రుణ చెల్లింపుల మొత్తం కూడా శాఘ్రంగా పెరిగిపోతోంది. దేశ యువతలో నిరుద్యోగిత చాలా ఎక్కువ (దాదాపు 25 శాతం) ఉంది. ఈ కారణాలన్నిటి వల్ల ప్రజల్లో అసంతృప్తి విపరీతంగా పెరిగింది. ఈ అసంతృప్తి పచ్చి-మితవాద శక్తుల పెరుగుదలకు దోహదం చేసింది.

**స్వీడెన్:** ఇక్కడ ప్రధాన మంత్రిగా మధ్యేవాద పార్టీ నాయకుడు ఉల్ఫ్ క్రిస్టెర్సన్ ఎన్నికయ్యారు. ఈయన నేతృత్వం వహిస్తున్న మూడు-పార్టీల కూటమిలో వలసకార్మికులను వ్యతిరేకించే స్వీడన్ డెమోక్రాట్లు చేరి మొదటి సారిగా ప్రభుత్వంలోకి వచ్చారు. దేశంలో జరిగిన ఎన్నికల్లో పచ్చి-మితవాద స్వీడన్ డెమోక్రాట్స్ (ఎస్‌డి) పార్టీ రెండు నుండి మూడు శాతం ఓట్లను అధికంగా చేజిక్కించుకుని నిజమైన విజేతగా నిలిచింది. పార్లమెంటులో అది రెండవ పెద్ద పార్టీగా ఆవిర్భవించింది. ఈ మితవాద కూటమి 49.7 శాతం ఓట్లతో అధికారంలో ఉన్న వామపక్ష కూటమి కన్నా ఒక్క స్థానం అధికంగా సంపాదించి అధికారాన్ని కైవశం చేసుకుంది. 1990వ దశకంలో స్వీడన్‌లో ఆవిర్భవించిన నయా-నాజీ ఉద్యమం నుండి ఎస్‌డి పుట్టింది. గతంలో జరిగిన తొమ్మిది సార్వత్రిక ఎన్నికల్లోనూ ఎస్‌డి తన ఓటింగు శాతాన్ని క్రమంగా పెంచుకుంటూ వచ్చింది. దేశంలో హింసా కాండపట్ల ప్రజల్లో ఉన్న భయాన్ని ఉపయోగించుకుని వలసకార్మికులకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తూ ఎస్‌డి ప్రజల్లో పట్టు పెంచుకున్నది. వలసకార్మికులు, హింసా కాండకు సమస్యలపై నిరంతర ప్రచారం ద్వారా ఈ పార్టీ ఇంధన ధరల పెంపు, పాఠశాల విద్య వైఫల్యం, ఆరోగ్య సంరక్షణ కేంద్రాల వద్ద పెద్ద పెద్ద క్యూలు వంటి సమస్యలపై ఉన్న ఆందోళనల నుండి ఓటర్ల దృష్టి మళ్లించింది.

**బ్రెజిల్:** బ్రెజిల్ ప్రజలు అక్టోబర్ 2న తొలిదఫా ఓటింగులో పాల్గొన్నారు. 2019 నుండి దేశాధ్యక్షునిగా ఉన్న జైర్ బోల్సెనారో అనుకున్న దానికన్నా ఎక్కువ ఓట్లు సంపాదించాడు. ఎన్నికల ముందు కొన్ని మాసాలుగా ప్రజాభిప్రాయ పోలింగ్‌లో

మాజి వామపక్ష అధ్యక్షుడు రెండంకెల లీడ్‌లో ముందున్నారు. చివరికి లూలాకు 48 శాతం ఓట్లు, బోల్సెనారోకు 43 శాతం ఓట్లు వచ్చాయి. బోల్సెనారో ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేసినప్పటికీ, డబ్బును వెదజల్లినప్పటికీ, ప్రజస్వామ్య సంస్థల గొంతునొక్కినప్పటికీ మొదటి రౌండులో 60 లక్షల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. మీడియాపైనా, సోషల్ మీడియాపైనా తనకున్న పట్టుతో బోల్సెనారో తప్పుడు వార్తలు ప్రచారం చేశాడు. పెంతెకోస్తల్ చర్చి మతగురువులను ఉపయోగించుకుని మతపరమైన భావాలను తనకు అనుకూలంగా మార్చుకోడానికి ప్రయత్నించాడు. ఎన్నికల తీర్పు తనకు వ్యతిరేకంగా వస్తే దాన్ని తాను ఆమోదించబోనని బోల్సొనారో ప్రకటించాడు. తొలి రౌండులో ఎవరికీ 50 శాతం ఓట్లు రానందున ఇప్పుడు అక్టోబర్ 30న తుది రైండు ఓటింగు జరుగుతోంది. మధ్యేవాద–వామపక్షానికి చెందిన మాజీ గవర్నర్ సిరో గోమెస్ ఓట్లతోపాటు మహిళల ఓట్లు లూలాకు పడతాయనీ, ఇవాంజెలికల్స్ బోల్సొనారోకు ఓట్లు వేస్తారని అంచనా. (తుది రౌండులో లూలా బ్రెజిల్ దేశాధ్యక్షునిగా విజయం సాధించారు....అను.)

**చిలీ రిఫరెండమ్:** పినోచెట్ పాలనా కాలం నాటి రాజ్యాంగ స్థానంలో ప్రవేశపెట్టిన కొత్త రాజ్యాంగంపై జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో చిలీ ఓటర్లు కొత్త రాజ్యాంగాన్ని తిరస్కరిచారు. దాదాపు 62 శాతం మంది ఈ అభివృద్ధికర రాజ్యాంగ ముసాయిదాకు వ్యతిరేకంగా ఓటు వేశారు. తిరస్కరించబడిన ఈ కొత్త రాజ్యాంగం అనేక అభివృద్ధికర సంస్కరణలు ప్రతిపాదించింది. చిలీని "భిన్నజాతుల" రాజ్యంగా ప్రకటించింది. చిలీ మూలవాసుల హక్కులను గుర్తించింది. గర్భస్రావ హక్కుతో సహా మహిళా సంఘాలు కోరిన అనేక హక్కులను కల్పించింది. ప్రభుత్వ సంస్థల్లో మహిళలకు కనీసం 50 శాతం స్థానాలు ఇవ్వాలని ప్రతిపాదించింది. ఈ రాజ్యంగంలోని ఒక అధికరణం గురించి ఓటర్లకున్న చిన్న పాటి సందేహంతో వారు మొత్తం రాజ్యాంగాన్ని తిరస్కరించారు. అలా తిరస్కరిస్తే దానికన్నా మంచి రాజ్యాంగం వస్తుందని ఆశించారు. తిరస్కరించబడిన ఈ రాజ్యాంగం ఆమోదించబడి ఉంటే అది ప్రపంచంలోనే అత్యంత పురోగామి రాజ్యాంగాల్లో ఒకటి అయి ఉండేది. చిలీ మూలవాసులకూ, మహిళలకూ, వాతావరణానికీ గొప్ప మేలు జరిగి ఉండేను. రాజ్యం ఆరోగ్యం, గృహవసతి వంటి సామాజిక అవసరాలను ప్రజలకు చట్టబద్ధంగా కల్పించాలని రాజ్యాంగం ప్రతిపాదించింది. అయితే ఈ రాజ్యాంగాన్ని తిరస్కరించడం అంటే పాత నియంతృత్వ కాలంనాటి రాజ్యాంగానికి ప్రజలు మద్దతిచ్చారని కాదు. ఎందుకంటే ఈ రాజ్యాంగం గునక తిరస్కరించబడితే కొత్త రాజ్యాంగాన్ని రచించాలని జులైలో జరిగిన ఒక అభిప్రాయ సేకరణలో 74 శాతం

మంది చిలీయన్లు కోరారు. అయితే ప్రజాభిప్రాయ సేకరణలో ఈ రాజ్యాంగ ముసాయిదా ఓడిపోవడం చిలీ వామపక్ష, పురోగామి శక్తులకు ఒక పెద్ద ఎదురుదెబ్బే.

పాకిస్తాన్‌లో జరిగిన ఉప–ఎన్నికల్లో ప్రతిపక్ష పాకిస్తాన్ తెహ్రెక్ పార్టీ పార్లమెంటులో మెజారిటీ స్థానాలు గెలుచుకుంది. పాలక పార్టీ సంఘటనకు ఇది పెద్ద ఎదురుదెబ్బ. పాకిస్తాన్ ప్రజలు తాము ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులపట్ల చాలా ఆందోళన చెందుతున్నారనీ, కొత్తగా సాధారణ ఎన్నికలు జరపాలన్న డిమాండుకు మద్దతు తెలుపుతున్నారనీ ఈ ఎన్నికల ఫలితాలు తెలియజేస్తున్నాయి.

**బ్రిటన్ పరిణామాలు :** బ్రిటన్ పార్లమెంటులో కన్సర్వేటివ్ పార్టీ ఎంపీల నాయకుడుగా రిషి సునాక్ ఎన్నికయ్యి ప్రధాని పదవిని చేపట్టారు. ఆయన బ్రిటన్ చరిత్రలో తొలి శ్వేతేతర ప్రధాన మంత్రి అనీ, రెండు శతాబ్దాల్లో ఈ పదవి చేపట్టిన అతి పిన్న వయస్కుడనీ, కింగ్ మోనార్క్ కన్నా ధనవంతుడనీ... పరిపరి విధాలుగా వర్ణిస్తున్నారు. అయితే గుర్తించాల్సిన విషయం ఏమంటే ఆయన ప్రపంచ ద్రవ్య పెట్టుబడి ఎంచుకున్న వ్యక్తి. గోల్డ్‌మాన్ సాచ్ మాజీ ఉద్యోగి, హెడ్జ ఫండ్ మాజీ మేనేజర్ అయిన సునాక్ ద్రవ్యపెట్టుబడి ప్రపంచానికి చెందిన వాడు. "నయా–ఉదారవాద విధానాలను అనుసరిస్తున్న అనేక దేశాల్లో వాటి ఆర్థిక వ్యవస్థలపైనే కాకుండా వాటి రాజకీయ వ్యవస్థలపైన కూడా ప్రపంచ ద్రవ్య పెట్టుబడి తన పట్టును" పెంచుకుంటున్నదని మన పార్టీ 23వ మహాసభ రాజకీయ తీర్మానంలో పేర్కొన్నాం.

లిజ్ ట్రస్ ప్రధాని పదవిలో ఉన్న 45 రోజుల్లో (బ్రిటన్ చరిత్రలో అతి తక్కువ కాలం) దేశం అనేక ఆర్థిక సంక్షోభాలనెదుర్కొన్నది. ధనవంతులకు మరిన్ని పన్ను రాయితీలు ఇవ్వడంతో పరిస్థితి మరింత తీవ్రమైంది. ఈ రాయితీలివ్వడానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ భయంతో పౌండు విలువ పడిపోయింది.

అన్ని విధాల ముంచుకొచ్చిన ఆర్థిక సంక్షోభం ప్రజల జీవన పరిస్థితిని బాగా దెబ్బతీసింది. దాంతో కన్సర్వేటివ్ పార్టీ ప్రజల మద్దతు కల్పోయే పరిస్థితి ఏర్పడింది. కన్సర్వేటివ్‌ల మీద లేబర్ పార్టీ పెద్ద తేడాతో ముందుకు దూసుకుపోయిందని ప్రజాభిప్రాయ సేకరణలు తెలియజేశాయి. అయితే కన్సర్వేటివ్ పార్టీ అనుసరించిన విధానాలకు భిన్నమైన సరైన ప్రత్యామ్నాయ విధానాలను లేబర్ పార్టీ అనుసరించలేకపోతున్నది. కన్సర్వేటివ్ ఎంపీలు వెంటనే ఎన్నికలు కోరుకోవడం లేదు. అందుకనే వారంతా కొత్త నాయకుని ఎన్నుకుని 2024లో ప్రస్తుత పార్లమెంటు గడువు ముగిసే వరకు పదవులకు అంటిపెట్టుకుని ఉండదలుచుకున్నారు.

## షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఓ) నాయకుల శిఖరాగ్ర సభ

2022, సెప్టెంబర్ 15-16 తేదీల్లో సామర్‌కండ్‌లో జరిగిన ఎస్‌సిఓ నాయకుల శిఖరాగ్ర సభ చర్చించిన అతి ముఖ్యమైన విషయం.. సభ్య దేశాల మధ్య తమ జాతీయ కరెన్సీలనుపయోగించి వాణిజ్యాన్ని విస్తరించాలన్నది. వాణిజ్యంలో జాతీయ కరెన్సీలనుపయోగించడానికి రోడ్‌మ్యాప్ తయారు చేయడం, ప్రత్యామ్నాయ చెల్లింపులు, పరిష్కారాల వ్యవస్థను అభివృద్ధి చేయడంపై ఎస్‌సిఓ ఇటీవల కొన్ని సంవత్సరాలుగా ప్రయత్నాలు సాగిస్తోంది. జాతీయ కరెన్సీలనుపయోగించి వాణిజ్యాన్ని పెంచుకోవడానికి ప్రతిపాదించబడిన రోడ్ మ్యాప్‌కు సమర్‌కండ్ శిఖరాగ్ర సహలో సభ్య దేశాల నాయకులు అంగీకరించారు. అంతర్జాతీయ కరెన్సీని డాలర్-రహితం చేయడం వైపుగా ఇదో ముందడుగు.

డాలర్‌పై ఆధారపడ్డం వల్ల మంచి కన్నా చెడు ఎక్కువ జరుగుతోందని గ్రహించిన దేశాలు డాలరుపై ఆధారపడ్డాన్ని తగ్గించుకుంటున్నాయి. ఆయా దేశాలు డాలరు రూపంలోని ఆస్తులను ఎలా వదిలించుకుంటున్నాయో ఐఎంఎఫ్ విడుదల చేసిన అధికార విదేశీ మారక నిల్వల గణాంకాలు తెలియజేస్తున్నాయి. 2022 మార్చిలో ప్రపంచ విదేశీ మారక నిల్వల్లో డాలర్లు 58.8 శాతానికి పడిపోయాయి. 1995 తరువాత ఇది అతి తక్కువ శాతం.

## చైనా కమ్యూనిస్టు పార్టీ (సిపిసి) మహాసభ

2022 అక్టోబర్ 16 నుండి 22 వరకు చైనా కమ్యూనిస్టు పార్టీ (సిపిసి) 20వ మహాసభ జయప్రదంగా జరిగింది. గత ఐదేళ్ల కాలంలో సిపిపి తన శతాబ్ది లక్ష్యాలు రెండింటిలో ఒకదాన్ని - పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించడం, 2021 నాటికి చైనాను ఒక మోస్తరు సౌభాగ్యవంతమైన సమాజంగా అభివృద్ధి చేయడం - సాధించింది. (సిపిసి స్థాపించి వందేళ్లు పూర్తయ్యేనాటికి)

ప్రపంచ ఆర్థిక సంక్షోభ కాలంలో కూడా సిపిసి దేశ ఆర్థిక వ్యవస్థను పురోగమనంలో నడపగలిగింది. 2021లో చైనా స్థూల జాతీయోత్పత్తి 17.7 లక్షల కోట్ల డాలర్లకు చేరుకున్నది. ఇది మొత్తం ప్రపంచ జిడిపిలో 18.5 శాతం. 2013 నుండి 2021 మధ్య అది సగటున ఏడాదికి 6.6 శాతం చొప్పున అభివృద్ధి సాధించింది. ఈ కాలంలో ప్రపంచ సగటు అభివృద్ధి 2.6 శతాన్ని అది అదిగమించి పురోగమించింది. 2013-2021 మధ్య కాలంలో అది ప్రపంచ ఆర్థికాభివృద్ధికి సగటున 38.6 శాతం సమకూర్చింది. జి-7 దేశాల మొత్తం కన్నా కూడా అది ఎక్కువ. 2020లో అది ప్రపంచంలో అతిపెద్ద వాణిజ్య దేశంగా అమెరికా స్థానాన్ని

ఆక్రమించింది. 2021లో కూడా 6.9 లక్షల కోట్ల డాలర్ల విదేశీ వాణిజ్యంతో అది తన ప్రథమ స్థానాన్ని నిలుపుకుంది.

చైనా తలసరి స్థూల జాతీయ ఆదాయం గత ఏడాది 11,890 డాలర్లకు చేరుకుంది. 2012తో పోలిస్తే రెట్టింపు అయింది. ఆదాయం పెరుగుదల, విద్య, వైద్య సదుపాయాల మెరుగుదల వల్ల చైనీయుల సగటు ఆయుర్దాయం 2020లో 77.9 ఏళ్లకు పెరిగింది. ప్రపంచ సగటు కన్నా ఇది 5.2 ఏళ్లు ఎక్కువ.

1982 నుండి చైనా పార్టీ నిబంధనావళికి సవరణలు చేయడం ప్రతి మహాసభలో ఒక ఆనవాయితీగా వస్తోంది. చైనా మార్గంలో ఆధునీకరణ ద్వారా చైనా జాతిని అన్ని రంగాల్లో పునర్నవీకరణవైపు పురోగమింపజేయడం పార్టీ కేంద్ర కర్తవ్యమని నిర్దేశిస్తూ దీన్ని పార్టీ నిబంధనావళిలో చేర్చారు.

దీంతోపాటు పార్టీ నిబంధనావళికి మరో ప్రధానమైన సవరణ కూడా చేశారు. 'ప్రభుత్వ రంగం ముఖ్యస్థానంలో ఉంటూ దాంతోపాటు విభిన్న యాజమాన్య రూపాలు కలిసి అభివృద్ధి చెందే వ్యవస్థ, పనిని బట్టి పంపిణీ పద్ధతి ముఖ్యస్థానంలో ఉంటూ దాంతోపాటు అనేక పంపిణీ రూపాలు మనుగడలో ఉండే వ్యవస్థ, సోషలిస్టు మార్కెట్ ఆర్థిక వ్యవస్థ.. వీటన్నిటితో కూడిన మౌలిక సోషలిస్టు ఆర్థిక వ్యవస్థలు చైనా లక్షణాలతో కూడిన సోషలిజానికి ముఖ్యమైన స్థంబాలుగా ఉండాలి' అన్న సూత్రాన్ని నిబంధనావళిలో చేర్చారు.

చైనాను అన్ని రంగాల్లో ఆధునిక సోషలిస్టు దేశంగా నిర్మించడం, 2020 నుండి 2035 నాటికి సోషలిస్టు ఆధునీకరణ సాధించడం, 2035 నుండి ఈ శతాబ్దం మధ్య నాటికి (చైనా ప్రజారిపబ్లిక్కు స్థాపించి శతాబ్ది పూర్తయ్యేనాటికి అంటే 2049 నాటికి) చైనాను సౌభాగ్యవంతమైన, బలమైన, ప్రజాస్వామ్యయుతమైన, సాంస్కృతికంగా పురోగమించిన, సామరస్య పూర్వకమైన, సుందరమైన దేశంగా నిర్మించడం అనేది రెండవ లక్ష్యంగా నిర్దేశిస్తూ దాన్ని పార్టీ నిబంధనావళిలో చేర్చారు.

జనతా ప్రజాస్వామ్యాన్ని విస్తృతంగా, పూర్తిస్థాయిలో, మరింత దృఢంగా విస్తరించాలన్న ప్రకటననూ, ప్రజాతంత్ర ఎన్నికలకూ, సంప్రదింపులకూ, నిర్ణయాలు చేయడానికీ, యాజమాన్యానికీ, పర్యవేక్షణకూ పటిష్టమైన వ్యవస్థనూ, నియమాలనూ నెలకొల్పాలన్న ప్రకటననూ పార్టీ నిబంధనావళిలో చేర్చాలని మహాసభ అంగీకరించింది.

పార్టీ క్రమశిక్షణకు సంబంధించి.. పార్టీ అధికారులు అన్ని స్థాయిల్లోనూ ప్రత్యేక సదుపాయాలను కోరుకునే ధోరణినీ, కార్యకలాపాలనూ విడనాడాలని ఆదేశిస్తూ

నిబంధనావళికి సవరణ చేర్చింది. దాంతోపాటు అవినీతిని నిర్మూలించే నిబంధనను కూడా చేర్చింది.

మహాసభ కొత్త కేంద్ర కమిటీని, కేంద్ర క్రమశిక్షణా, పర్యవేక్షణ కమిషన్‌ను ఎన్నుకున్నది. కొత్తగా ఎన్నికయిన కేంద్ర కమిటీ సి జిన్‌పింగ్‌ను సిపిసి ప్రధాన కార్యదర్శిగా తిరిగి ఎన్నుకున్నది. కొత్త పొలిట్ బ్యూరోను ఎన్నుకున్నది. ఏడుగురు సభ్యుల (ప్రధాన కార్యదర్శితో సహా) పొలిట్ బ్యూరో స్థాయీ సంఘాన్ని ఎన్నుకున్నది. వారిలో నలుగురు కొత్తవారు. సి జిన్‌పింగ్ కేంద్ర మిలిటరీ కమిషన్ చైర్మన్‌గా కూడా తిరిగి ఎన్నికయ్యారు.

## జాతీయ పరిస్థితి

**ఆర్థిక వ్యవస్థ :** భారత ఆర్థిక వ్యవస్థ మరింత తీవ్రమైన సంక్షోభంలో కూరుకుపోతున్నది. ఆర్థిక మాంద్యం అంతకంతకు తీవ్రమయ్యే ధోరణులు కనిపిస్తున్నాయి. అన్ని అంతర్జాతీయ సంస్థలతో పాటు, ఆర్‌బిఐ కూడ అంతకు ముందు వెల్లడించిన అభివృద్ధి అంచనాలను తగ్గించి వేశాయి. అంతకు ముందు ప్రపంచ బ్యాంకు 2023 ఆర్థిక సంవత్సరానికి 8.7 శాతం అభివృద్ధి అంచనా వేసింది. తర్వాత ఏప్రిల్‌లో ఆ అంచనాను 7 శాతానికి, ఇప్పుడు అక్టోబరులో 6.5 శాతానికి తగ్గించింది.

అభివృద్ధి అంచనాలను ప్రపంచ బ్యాంకు మూడుసార్లు తగ్గించగా, ఆర్‌బిఐ తొలుత 7.8 శాతంగా అంచనా వేసి, తర్వాత 7.2 శాతానికి ఇప్పుడు 7 శాతానికి తగ్గించింది. భారత జిడిపి పెరుగుదల రేటు మరింతగా 4.7 శాతానికి తగ్గిపోతుందని అంక్టాడ్ హెచ్చరించింది.

**క్షీణిస్తున్న పారిశ్రామికాభివృద్ధి :** గణాంకాలు, పథకాల అమలు మంత్రిత్వ శాఖ అక్టోబరు 12 న విడుదల చేసిన సమాచారం ప్రకారం పారిశ్రామికాభివృద్ధి పెరుగుదల ఈ ఆర్థిక సంవత్సరం జులైలో 2.2 శాతం నుండి, ఆగస్టు నాటికి గత 18 మాసాలలో ఎన్నడూ లేనంతగా – 0.8 శాతానికి క్షీణించింది. బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, చమురు శుద్ధి ఉత్పత్తులు, ఎరువులు, ఉక్కు, సిమెంటు విద్యుత్తుతో సహా 8 మౌలిక సదుపాయ పరిశ్రమల్లో ఉత్పత్తి పెరుగుదల గత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్, ఆగస్టు మధ్య కాలంలో 19.4 శాతం ఉంటే, ఈ ఏడాది అదే కాలంలో 9.8 శాతం మాత్రమే నమోదయింది.

**తగ్గిపోతున్న విదేశీ మారక నిల్వలు :** ఆర్‌బిఐ విడుదల చేసిన వివరాల

ప్రకారం మన విదేశీ మారక నిల్వలు అతి తక్కువ స్థాయికి చేరుకున్నాయి. గత ఏడాది 64,240 కోట్ల డాలర్లుగా ఉన్న విదేశీ మారక నిల్వలు ఈ అక్టోబరు నాటికి 2020 తర్వాత ఎన్నడూ లేనంతగా 52,834 కోట్ల డాలర్లకు తగ్గిపోయాయి.

**రూపాయి పతనం:** అమెరికా డాలరుతో పోల్చుకున్నపుడు ఈ ఏడాది రూపాయి విలువ 10 శాతం తగ్గిపోయింది. మొట్టమొదటి సారి గత వారంలో 83 రూపాయలకు పడిపోయింది. రిజర్వుబ్యాంకు రూపాయి విలువను మరింత పడిపోకుండా నిలబెట్టడానికి జోక్యం చేసుకోవడం వల్లనే విదేశీ మారక నిల్వల తరుగుదలలో మూడోవంతు జరిగింది.

**విస్తరిస్తున్న వాణిజ్య లోటు:** భారత దేశపు కరెంటు ఖాతా లోటు గత మార్చి త్రైమాసికలో 1.5 శాతం ఉంటే, జూన్ త్రైమాసికలో 2.8 శాతానికి పెరిగింది. రూపాయి విలువ పడిపోవడంతో దిగుమతులు మరింత ప్రియమయ్యాయి. ఒపెక్ దేశాలు చమురు వెలికతీతకు కోతలు విధించడం మూలంగా ప్రపంచ చమురు ధరల్లో అనిశ్చితి చోటుచేసుకుంటుంది. భారత దేశం చమురు దిగుమతులపై విపరీతంగా ఆధారపడటంతో విదేశీ వాణిజ్య లోటు మరింత పెరిగే అవకాశం ఉంది. దీనితో పాటు బయటకు వెళ్లిపోయే విదేశీ వ్యవస్థాగత పెట్టుబడులు (ఎఫ్ఐఐలు) సెప్టెంబరులో 700 కోట్ల డాలర్లను మించిపోయాయి. దీనితో రూపాయి మారకం విలువ మరింత తగ్గేలా వత్తిడి పెరుగుతుంది. ఇప్పటికే పెట్రోలియం ఉత్పత్తుల ధరలు చాల ఎక్కువగా ఉన్న పరిస్థితిలో ఈ అంశాలన్నీ ప్రజలపై మోపే భారాలు మరింత పెరగడానికి దారితీస్తాయి.

### అధ్వాన్నమవుతున్న జీవన పరిస్థితులు

తీవ్రమవుతున్న ఆర్థిక సంక్షోభ ప్రభావం ప్రజల జీవనాధారాలపై మరింత భారాన్ని మోపడంలో వ్యక్తమవుతుంది. సిఎంఐఇ విడుదల చేసిన వివరాల ప్రకారం దేశంలో నిరుద్యోగం రేటు గత సెప్టెంబరులో 6.43 శాతం నుండి, అక్టోబరు నాటికి 7.86 శాతానికి పెరిగింది. గ్రామీణ ప్రాంతాలలో 8.01 శాతం, పట్టణ ప్రాంతాలలో 7.53 శాతంగా ఉంది.

ఉద్యోగిత రేటు ఇంత నామమాత్రంగా ఉన్న పరిస్థితుల్లో గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ఆర్ఇజిఎస్) నిధులు మరింత కోతకు గురవుతున్నాయి. 2022 ఏప్రిల్ 1, అక్టోబరు 21 మధ్య కాలంలో 1.5 కోట్ల ఉపాధి అప్లికేషన్లు తిరస్కరించబడినాయి. ఇంతకు ముందు కరోనా కాలం 2020–21లో 2.1 కోట్ల

మందికి, 2021-22లో 1.73 కోట్ల మందికి ఉపాధి లేకుండా పోయింది. దీనికి ప్రధాన కారణం నిధుల మంజూరు అంతకంతకూ తగ్గిపోవడం, నిధుల విడుదల మందగొడిగా సాగడం, ఫలితంగా బకాయిలు పేరుకు పోవడం. దీనికి మోడీ ప్రభుత్వం ఇస్తున్న వివరణ ఈ పథకం గిరాకి ఆధారంగా కొనసాగుతుందని, గిరాకీకి అనుగుణంగా నిధులు విడుదల చేయబడుతున్నాయని. మరొకవైపున తిరస్కరణకు గురైన ఉపాధి కావాలని అభ్యర్థిస్తున్న వారంతా బోగస్ వారని చెబుతున్నది. ఏడాదికి కనీసం 200 పనిదినాలు గ్యారంటీ చేయబడేలా నిధులు పుష్కలంగా అందించబడుతున్నాయని అంటున్నది.

ప్రపంచ బ్యాంకు అధ్యయనం ప్రకారం 2020లో కరోనా మూలంగా ప్రపంచ వ్యాపితంగా పేదరికంలోకి నెట్టబడిన వారిలో 80 శాతం మంది భారత దేశం నుండే. కరోనా మూలంగా ఆర్థిక నష్టాలకు గురైన వారు ప్రపంచ వ్యాపితంగా 7 కోట్ల మంది అయితే, భారత దేశంలోని వారే 5.6 కోట్ల మంది.

**పెరుగుతున్న ఆకలి:** అక్టోబరు 14 న విడుదల చేయబడిన ప్రపంచ ఆకలిసూచీ ప్రకారం 121 దేశాల్లో భారత్ 107వ స్తానంలో ఉంది. ఈ సూచీ పోకాహారానికి సంబంధించిన నాలుగు అంశాల ఆధారంగా తయారు చేయబడుతుంది. అవి, పౌష్టికాహార లోపం, బాలల్లో ఎదుగుదల లేకపోవడం, బాల్యం వృధా, బాలల్లో మరణాలు. అన్ని ప్రపంచ సూచికల మాదిరిగానే మోడీ ప్రభుత్వం ఆకలి సూచీని కూడ అంగీకరించలేదు. అసలు ఈ సమాచారానికి ఆధారం ఏమిటి అని ప్రశ్నించింది. పౌష్టికాహారలోపానికి సంబంధించిన వివరాలు ఐక్య రాజ్య సమితి ఆహారం, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) 2022 జులైలో విడుదల చేసిన ఆహార భద్రతా సమాచారం నుండి లభించాయి. బాలల్లో ఎదుగుదల లేకపోవడం, వృధా బాల్యం వివరాలు 2019-21 కి సంబంధించి తాజాగా విడుదలైన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 నుండి లభించాయి. బాలల మరణాల రేటు 2021 కి సంబంధించి ఐక్యరాజ్య సమితి విడుదల చేసిన సమాచారం నుండి స్వీకరించబడినాయి.

**నడ్డి విరిచే ధరల భారం:** 2022 సెప్టెంబరులో భారత దేశంలో వినియోగధరల ద్రవ్యోల్బణం 7.4 శాతం. తొమ్మిది నెలలకు పైగా ద్రవ్యోల్బణం రిజర్వు బ్యాంకు సూచించిన గరిష్ట రేటు 6 శాతం కన్నా ఎక్కువగానే ఉంటున్నది. వినియోగధరల సూచీలో దాదాపు 39 శాతం ఆహార ధరలకు సంబంధించిందే. వినియోగ ధరల ద్రవ్యోల్బణం రేటు పట్టణ ప్రాంతాలలో కన్నా గ్రామీణ ప్రాంతాలలో కొంత ఎక్కువగా ఉంది. ద్రవ్యోల్బణ ప్రభావం గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి మీద మరింత ఎక్కువగా ఉందన్న అంశాన్ని ఇది సూచిస్తున్నది.

సెప్టెంబరు వినియోగ ధరల ద్రవ్యోల్బణం ఎక్కువగా కూరగాయల ధరల్లో (18.5 శాతం), సుగంధ ద్రవ్యాలు (16.88), ఇతర ఉత్పత్తులు (11.53 శాతం) లో నమోదయింది. చిరుధాన్యాలు, చిరుధాన్యాల ఉత్పత్తుల్లో 2013 నుండి ఎన్నడూ లేనంత అధికంగా నమోదయింది. రెండు అతి ప్రధానమైన చిరుధాన్యాలు బియ్యం, గోధుమల ద్రవ్యోల్బణం బహిరంగ మార్కెట్లో సెప్టెంబరులో 9.2 శాతం, 17.4 శాతంగా నమోదయింది.

**కనీస మద్దతు ధర నామమాత్రంగా పెంపు:** గోధుమ కనీస మద్దతు ధరను కేవలం రూ.110 లు పెంచారు. 2022-23లో క్వింటాలుకు రూ. 2015 లు ఉంటే, 2023-24 కు రూ.2125 లు కు పెంచారు. బార్లీ కనీస మద్దతు ధర రూ. 1635 లు నుండి రూ. 1735 లు కు అంటే రూ.100లు పెంచారు. పప్పుధాన్యాలకు రూ.5,230 నుండి, రూ.5,335 కు అంటే రూ.105లు పెంచారు. కుసుమలకు మద్దతు ధర రూ. 5,441 లు నుండి, రూ. 5,650 లు కు అంటే రూ. 209 లు పెంచారు. రేప్ విత్తనాలు, ఆవాలకు రూ. 5,050 లు నుండి రూ. 5,450 లు కు అంటే రూ.400లు పెంచారు. కనీస మద్దతు ధరల్లో ఈ నామమాత్రపు పెరుగుదల పెట్టుబడులపై ద్రవ్యోల్బణ పెరుగుదల ప్రభావాన్ని కూడ భర్తీ చేయదు. అంతే కాదు, ఈ నామ మాత్రపు పెరుగుదల సైతం సేకరణ తగినంతగా పెరగకపోతే అర్థరహితంగా మారుతుంది. పెట్టుబడులపై 50 శాతం కలిపిన ధర, కచ్చితంగా ప్రభుత్వ సేకరణ వాగ్దానాన్ని మోడీ ప్రభుత్వం వమ్ము చేసింది.

ఇది ఒక ఆందోళనకరమైన పరిస్థితి. కనీస జీవనానికి సరిపడినంత పప్పులు, బియ్యం, గోధుమ పిండి లభ్యత మెజారిటీ ప్రజానీకానికి అందని పరిస్థితి ఏర్పడింది. ఒక వైపున ద్రవ్యోల్బణం పెరిగిపోతున్నది, మరొక ప్రభుత్వ గోదాముల్లో ఆహార ధాన్యాల నిల్వలు గత ఐదేళ్ళలో ఎన్నడూ లేనంత తక్కువ స్థాయికి పడిపోయాయి. ఇది భారత దేశాన్ని ఆహార కొరత దేశంగా, ఆహార భద్రత సంక్షోభం దిశగా ప్రమాదకరంగా నెట్టివేస్తున్నది.

**దారుణంగా పెరిగిన అసమానతలు:** ఒక వైపున ప్రజల జీవన పరిస్థితులు దారుణంగా దిగజారుతుండగా, మరొక వైపున ధనవంతుల మధ్య, పేదల మధ్య ఆర్థిక అసమానతలు అసహ్యకరమైన స్థాయిలో పెరిగిపోతున్నాయి. ఆశ్రిత పెట్టుబడిదారులకు రూ. 11 లక్షల కోట్ల మేరకు పన్ను రాయితీలు, రుణాల రద్దు ఈ పరిస్థితికి దోహదం చేస్తున్నాయి. పెరిగిపోతున్న ద్రవ్యోల్బణం అపరిమిత లాభాలను

పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నది. మరొక వైపున ప్రధాన ఆహార వస్తువులపై జిఎస్‌టి విధించడం అసమానతలు అధికం కావడానికి కారణమవుతున్నది. మోడీ ప్రభుత్వం అతి సంపన్నులపై పన్నులు విధించాలి, ప్రజలకు ఉపశమనం అందించాలి.

**తీవ్రమౌతున్న మతపరమైన విభజన**

ఆర్థిక సంక్షోభం కారణంగా ప్రజలపై పడుతున్న ఈ భారాలను, దుర్భర పరిస్థితిని విస్మరిస్తూ మోడీయే స్వయంగా ప్రజల మధ్య మతపరమైన విభజనను తీవ్రం చేసే ప్రచారానికి నాయకత్వం వహిస్తున్నారు. బదరీనాథ్, అయోధ్య, ఇంకా ఇతర మత ప్రదేశాలలో మోడీ నిర్వహించిన పూజా క్రతువులు మీడియాలో విశేష స్థానాన్ని ఆక్రమిస్తున్నాయి. ఏదో ఒక సాకుతో ముస్లిములను నిరంతరం లక్ష్యంగా చేసుకుంటున్నారు. ముస్లిములపై హీనమైన భౌతిక దాడులు పెరిగిపోతున్నాయి. విష విద్వేషాలు, హింసాకాండ ప్రచారాల విస్తరణ పెరిగిపోతున్నది. గుజరాత్‌లోని ఖేడాలో మఫ్టీలో ఉన్న పోలీసులు ముస్లిం యువకులను బహిరంగంగా బాదడం దిగ్భ్రాంతి గొలిపింది.

**బిల్కిస్ బానో కేసు:** బిల్కిస్ బానో కేసులో శిక్షలు అనుభవిస్తున్న 11 మంది నేరస్తులను సత్ప్రవర్తన ప్రాతిపదికన విడుదల చేయడానికి మోడీ ప్రభుత్వం ఆమోదించడం అత్యంత దిగ్భ్రాంతికరమైన అంశం. ఈ 11 మంది అత్యంత కిరాతకమైన అత్యాచారం, హత్యా నేరాలు రుజువయిన వారు. ఈ సామూహిక అత్యాచారం, హత్య బిల్కిస్ బానో ఎదురుగా జరిగాయి. ఐదుమాసాల గర్భవతి అయిన బిల్కిస్ బానో సైతం అత్యాచారానికి గురయింది. మహిళలపై అత్యాచారం జరిపిన తర్వాత బిల్కిస్ బానో మూడేళ్ళ కుమార్తెతో సహా మొత్తం 13 మంది హత్య చేయబడ్డారు. అప్పటికే తాను చనిపోయానని బిల్కిస్ బానో భావించుకుంటున్నది.

సిబిఐ అభ్యంతరం తెలియ చేసినప్పటికీ, కేంద్రం బిల్కిస్ బానో కేసు నేరస్తులను విడుదల చేయడానికి అనుమతించిందని గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టుకు అఫిడవిట్ సమర్పించింది. అతి హీనమైన, అతి తీవ్రమైన నేరాలకు పాల్పడిన నేరస్తులకు శిక్ష తగ్గించడానికి కేంద్రం పూనుకున్నది. మైనారిటీ ముస్లిములను లక్ష్యంగా చేసుకోవడం నేరం కాదన్న భావనను ఈ ఉదంతాలు కల్పిస్తున్నాయి. ఇలాంటి దారుణమైన నేరస్తులకు మోడీ ప్రభుత్వం రక్షణ కల్పించడం మతపరమైన విభజనను తీవ్రం చేయడానికి ఎంత అమానుషమైన స్థాయికి దిగజారిపోయిందో సూచిస్తున్నది.

పార్టీ 23వ మహాసభ పిలుపునిచ్చినట్లుగా ఇలాంటి మతపరమైన విభజనను తీవ్రం చేయడానికి వ్యతిరేకంగా అన్ని లౌకికవాద శక్తులను అత్యంత విస్తారమైన ప్రాతిపదికన సమీకరించి బలోపేతం చేయాలి.

**ఫెడరలిజాన్ని దెబ్బతీయడం**

రాజ్యాంగం మౌలిక పునాదుల్లో ఒకటైన ఫెడరలిజాన్ని దెబ్బతీసే, ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను హరించే ప్రయత్నాలు మరింతగా పెరుగుతున్నాయి. భారత దేశంలో కేంద్రీకృత రాజ్యవ్యవస్థను నెలకొల్పడానికి బిజెపి, ఆరెస్సెస్‌లు ప్రయత్నిస్తున్నాయి. శాంతి భద్రతలు రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోనివి. అయినప్పటికీ పోలీసులకు 'ఒకే దేశం, ఒకే యూనిఫారం' అని మోడీ ఇచ్చిన నినాదం ఈ హక్కును కాలరాస్తున్నది.

**ద్రవ్యపరమైన ఫెడరలిజం:** ఇటీవల కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల ద్రవ్య లోటు పరిధిని కుదించింది. కేంద్రం ఇప్పుడు రాష్ట్రాలు చేసే బడ్జెటేతర రుణాలను కూడ ద్రవ్య లోటు లెక్క లోకి తీసుకువచ్చింది. ఆ విధంగా రాష్ట్రాలు సాధారణంగా చేసే రుణాలను తీవ్రంగా కుదించివేసింది. ఇదే సమయంలో కేంద్రం ఏటా రెండు, మూడు లక్షల కోట్ల బడ్జెటేతర రుణాలను తన ద్రవ్య లోటు పరిధిలోకి తీసుకురావడం లేదు.

**హిందీ భాషను రుద్దడాన్ని వ్యతిరేకించాలి:** అమిత్ షా నాయకత్వంలోని అధికార భాషా పార్లమెంటరీ కమిటీ కేంద్ర యూనివర్శిటీలతో సహా అన్ని విద్యా సంస్థల్లోను హిందీని బోధనా భాషగా తప్పనిసరిగా అమలు చేయాలని సిఫార్సు చేసింది. 'హిందూ, హిందీ, హిందూస్థాన్' అనే ఆరెస్సెస్ భావనను భారత దేశపు విశిష్టమైన, సుసంపన్నమైన భాషా సంప్రదాయంపై రుద్దడం ఎంత మాత్రం అంగీకరించరానిది. రాజ్యాంగం 8వ షెడ్యూలులో చేర్చబడిన 22 అధికారిక భాషలన్నింటినీ సమాన ప్రాతిపదికన చూడాలి, ప్రోత్సహించాలి.

**విద్యారంగంలో దురాక్రమణ:** విద్య రాజ్యాంగం ఉమ్మడి జాబితాలో ఉంది. విద్యా విధానాల విషయంలో ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలకూ సమాన హక్కులున్నాయి. 2020లో కోవిడ్ ఆంక్షలు అమల్లో ఉన్న కాలంలో కేంద్రం నూతన విద్యావిధానాన్ని ఏకపక్షంగా ప్రకటించింది. ఇది రాష్ట్రాల హక్కులను తీవ్రంగా ఉల్లంఘించింది. రాష్ట్రాల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోలేదు.

యూనివర్శిటీల చాన్సలర్లుగా ఉంటూ బిజెపి కేంద్ర ప్రభుత్వం నియమించిన గవర్నర్లు వ్యవహరించే తీరు తక్షణం పరిష్కరించాల్సిన అంశాలను తీవ్రంగా ముందుకు తీసుకువచ్చింది. యుజిసి నిబంధనలను కేంద్ర చట్టంగా పరిగణించాలని, అన్ని

రాష్ట్రాలు వాటికి కట్టుబడి ఉండాలని ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన ఉత్తర్వును సమీక్షించాలి. పార్లమెంటరీ రూల్స్ ఆమోదించిన యుజిసి చట్టం క్రింద రూపొందించబడిన యుజిసి నిబంధనలు సబార్డినేట్ నిబంధనలు. అవి ఎగ్జిక్యూటివ్ చర్యలు. రాజ్యాంగం ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యకు సంబంధించి రాష్ట్రాల అసెంబ్లీలు తీసుకు వచ్చిన చట్టాలను కానీ, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న ఎగ్జిక్యూటివ్ చర్యలను కానీ అవి అతిక్రమించడం కానీ, రద్దుచేయడం కానీ చేయజాలవు.

భారీ మొత్తాలను ఎరచూపి, టిఆరెస్ ఎమ్మెల్యలను కొనివేసే ప్రయత్నాలు బిజెపి ***ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరం పాలు చేయడానికి తన ప్రయత్నాలను*** ఎలా కొనసాగిస్తున్నదో సూచిస్తున్నది.

## న్యాయ వ్యవస్థ

ఉపా క్రింద నిర్బంధించబడిన డా. సాయిబాబా ఇంకా ఇతరుల కేసులో రాజ్యాంగం హామీ కల్పించిన భారత పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛ ఎలా ఉల్లంఘించబడిందో వెల్లడయింది. వారి నిర్బంధం చెల్లదని అక్టోబరు 14న బోంబే హైకోర్టు ప్రకటించి వారిని వెంటనే విడుదల చేయాలని ఆదేశించింది. ఆ ఆదేశం వెలువడిన కొద్ది గంటల్లోనే మహరాష్ట్ర ప్రభుత్వం వారి విడుదల ఉత్తర్వుపై తక్షణం స్టే విధించాలని సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఆ మరుసటి రోజే శనివారం కోర్టు పని దినం కానప్పటికీ ప్రత్యేక విచారణకు సుప్రీం కోర్టు ఏర్పాటు చేసిన బోంబే హైకోర్టు తీర్పు చెల్లదని చెప్పింది. నిర్బంధంలో ఉన్న సాయిబాబా పలురకాలైన వికలాంగుడు, చక్రాల కుర్చీకి పరిమితమయినవాడు. నిర్బంధితుల్లో మరొకరు పాండు నరోటె నిర్బంధంలోనే అనారోగ్యంతో చనిపోయాడు. ఇంతకు ముందే నిర్బంధంలో అనారోగ్యంతో విషాదకరమైన రీతిలో చనిపోయిన స్టాన్ స్వామి సుప్రీం కోర్టు పరిగణనలోకి కూడ రాలేదు.

ఢిల్లీ హైకోర్టు ఉమర్ ఖాలీద్‌కు, బోంబె హైకోర్టు జ్యోతి జగతప్‌కు మరోసారి బెయిల్‌ను నిరాకరించాయి.

జడ్జీల నియామకానికి, పదోన్నతికి సంబంధించి సుప్రీం కోర్టు కొలీజియం ఏకగ్రీవంగా చేసిన సిఫార్సులను బిజెపి కేంద్ర ప్రభుత్వం ఆమోదించకుండా జాప్యం చేయడం ఆందోళన కలిగించే అంశం. కేంద్ర న్యాయశాఖా మంత్రి ఇటీవల జడ్జీలను నియమించే అధికారం ప్రభుత్వానికి మాత్రమే ఉండాలని వ్యాఖ్యానించారు. ఇలా నిలిపివేసిన వాటిలో మద్రాసు హైకోర్టు ప్రధాన నామూర్తిగా సిఫార్సు చేయబడిన జస్టిస్ మురళీధర్ నియామకాన్ని తొక్కిపట్టడం ఒకటి. 2020 ఫిబ్రవరిలో ఢిల్లీలో

మత విద్వేషాలను రెచ్చగొడుతూ ప్రసంగాలు చేసిన వారిపై ఎలాంటి చర్య తీసుకోనందుకు ఢిల్లీ పోలీసులను, కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా తప్పుపట్టిన మరళీధర్‌ను కొద్ది గంటల్లోనే ఢిల్లీ హైకోర్టు నుండి బదిలీ చేశారు.

**పెగాసస్ నిఘా పరికరాలు :** ఇంటిలిజెన్స్ బ్యూరో ఇజ్రాయల్ నిఘా పరికరాల సంస్థ ఎన్ఎస్ఓ గ్రూపు నుండి హార్డ్‌వేర్‌ను కొనుగోలు చేసిందని సంఘటిత నేరాలు, అవినీతి రిపోర్టింగ్ ప్రాజెక్టు (ఒసిసిఆర్‌పి) నిర్వహించిన దర్యాప్తు వెల్లడించింది. ఈ వెల్లడి "పెగసస్ వేరేచోట వినియోగించిన తన ప్రధాన నిఘాపరికరాలను నెలకొల్పడానికి దిగుమతి చేసుకుని పెగసస్ సాఫ్ట్‌వేర్ దిగుమతి పత్రాలు చెబుతున్నాయి." అన్న దానికి ఈ దర్యాప్తు ఫలితాలు కూడ సరిపోతాయి. ఇంతకు ముందు న్యూయార్క్ టైమ్స్ రిపోర్టును కూడా మోడీ ప్రభుత్వం నిర్లజ్జగా తిరస్కరించింది. 2017లో భారత ప్రభుత్వం పెగసస్ నిఘా పరికరాలను కొనుగోలు చేసిందని ఆ రిపోర్టు చెప్పింది. ఈ విషయంపై దర్యాప్తుకు ప్రభుత్వం సహకరించలేదని సుప్రీం కోర్టు చెప్పింది. తాజాగా వెల్లడయిన ఈ విషయాన్నింటినీ న్యాయవ్యవస్థ గుర్తించాలి. ఈ బహిరంగ రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు మోడీ ప్రభుత్వాన్ని జవాబుదారీ చేయాలి. "నిఘా రాజ్య నిర్మాణం" అని పార్టీ 23వ మహాసభ చెప్పిన దాన్ని ఈ అంశాలు ధృవీకరిస్తున్నాయి.

## ఎన్నికల కమిషన్

బిజెపి రాజకీయ ఎజెండాను ముందుకు తీసుకువెళ్ళేందుకు ఎన్నికల కమిషన్ ఇటీవలి కాలంలో చురుగ్గా పనిచేస్తున్నది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని సవరించడానికి ప్రతిపాదించింది. రాజకీయ పార్టీలు తాము ఎన్నికల ప్రణాళికల్లో చేస్తున్న వాగ్దానాల అమలుకు కావలసిన నిధులను ఎలా సమకూర్చుకుంటాయి, ఆ వాగ్దానాల అమలు రాష్ట్ర లేదా కేంద్ర ఆర్థిక పరిస్థితిపై ఎలాంటి ప్రభావం చూపుతుందో రాజకీయ పార్టీలు వెల్లడించేలా చేసేందుకు ఈ ప్రతిపాదన చేయబడింది. ఇది పూర్తిగా అవాంఛనీయ చర్య.

ఎన్నికల కమిషన్ స్వేచ్ఛాయుతమైన, న్యాబద్ధమైన ఎన్నికలు నిర్వహించాలని రాజ్యాంగం ఆదేశిస్తున్నది. రాజకీయ పార్టీలు చేసే విధానపరమైన ప్రకటలను, అవి వాగ్దానం చేసే సంక్షేమ చర్యలను నియంత్రించడం ఎన్నికల కమిషన్ పని కాదు. ఒక ప్రజాస్వామ్యంలో ఇది పూర్తిగా రాజకీయ పార్టీల విశేష హక్కు.

ఏప్రిల్‌లో ఎన్నికల కమిషన్ సుప్రీం కోర్టుకు సమర్పించిన అఫిడవిట్ రాజకీయ పార్టీల విధాన నిర్ణయాలను కమిషన్ నియంత్రించజాలదని పేర్కొంది.

అలా చేస్తే అది 'తన అధికారాలను అతిక్రమించడమే' అని చెప్పింది. ప్రజల సమస్యలను పట్టించుకోవడానికి, వాటి నుండి ఉపశమనం పొందడానికి హామీలు ఇవ్వడానికి రాజకీయ పార్టీలకు సంపూర్ణమైన హక్కు ఉందని, ఆ హక్కుపై పరిమితులు విధించడానికి, నియంత్రించడానికి ఎన్నికల కమిషన్ చేసే ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఎన్నికల కమిషన్‌కు పార్టీ లేఖ రాసింది.

ఎన్నికలు జరగబోయే గుజరాత్, హిమాచల్ ప్రదేశ్‌లలో ప్రధాని మోడీ ప్రజా ధనాన్ని ఖర్చు పెడుతూ అనేక బహిరంగ సభల్లో ప్రసంగిస్తూ ఎన్నో 'ఉచితాలను', దీపావళి బహుమానాలను ప్రకటిస్తున్నాడు. దీనిపై మాత్రం ఎన్నికల కమిషన్ ఎలాంటి అభ్యంతరాన్ని లేవనెత్తలేదు. కాని అన్ని ఇతర పార్టీలు ప్రజల సమస్యలకు ఉపశమనం కోసం ఇచ్చే హామీలపైన ఆంక్షలు విధించాలని ప్రయత్నిస్తున్నది. ఇది ఎంత మాత్రం ఆంగీకార యోగ్యం కాదు.

**గుజరాత్ ఎంఓయులు :** గుజరాత్ లోని వెయ్యికి పైగా కార్పొరేట్ కంపెనీలతో వారి సిబ్బంది ఎన్నికల్లో ఎలా పాల్గొంటున్నారు, ఎవరు ఓటు వేయడం లేదు అన్న అంశాలను పరిశీలించడానికి ఎన్నికల కమిషన్ తీవ్ర అభ్యంతకరమైన రీతిలో ఎంఓయులు కుదుర్చుకున్నది. ఇలా 'పేరు పెట్టి అవమానించడం' ,నిర్బంధ ఓటింగ్ కోసం వత్తిడి చేసే చర్య అవుతుంది. ఇది ఓటు హక్కు కోసం రాజ్యాంగం 326 అధికరణం కల్పించిన హామీని స్పష్టంగా ఉల్లంఘించడమే. నిర్బంధ ఓటింగ్ విధానాన్ని ప్రవేశపెట్టినట్టయితే అది దేశంలో ఒక అప్రజాస్వామిక వాతావరణాన్ని సృష్టిస్తుంది అని 2015లో కేంద్ర న్యాయశాఖా మంత్రి సుప్రీం కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొన్నాడు. కేంద్ర ప్రభుత్వం కూడ సుప్రీం కోర్టుకు సమర్పించిన ఒక నివేదనలో ఓటు హక్కులో ఓటు చేయకపోయే హక్కు కూడ ఉందని చెప్పింది. ఓటు హక్కును ఒక ప్రాథమిక కర్తవ్యంగా నిర్దేశించ లేమని ఎన్నికల సంస్కరణలపై నియమించిన లా కమిషన్ తన నివేదికలో పేర్కొంది.

ఓటు హక్కును ప్రాథమిక కర్తవ్యంగా అమలు చేసేందుకు కార్పొరేట్లను వినియోగించడానికి ఎన్నికల కమిషన్ ప్రస్తుతం చేస్తున్న ప్రయత్నాలు సంపూర్ణంగా రాజ్యాంగ విరుద్ధం. అంతే కాకుండా, పేర్లు తెలియకుండా కార్పొరేట్లు ఎన్నికల నిధులు సమకూర్చడానికి ఉద్దేశించబడిన ఎన్నికల బాండ్ల వ్యవహారం ఇప్పటికే వివాదాస్పదంగా ఉంది. ఇప్పుడు ఈ చర్య ఎన్నికల నిర్వహణలో కార్పొరేట్ల జోక్యాన్ని మరింత ముందుకు తీసుక వెళుతుంది. ఇంకా, ప్రస్తుత ఇవిఎం తరహా ఓట్ల లెక్కింపు క్రమంలో బ్యాలట్ పేపర్లను కలిపి వేయడం అన్న ప్రక్రియే ఉండదు. ఒక్కొక్క బూత్‌లో ఎన్నికల క్రమం ఎలా జరిగిందన్న దాన్ని ఇవిఎం లెక్కింపు పారదర్శకంగా తెలియ

చేస్తుంది. దీని మూలంగా, ఎన్నికల్లో కార్మికులు పాల్గొనడాన్ని కార్పొరేట్లు పర్యవేక్షించడం ఎవరు ఎన్నికల్లో ఎలా పాల్గొన్నారో, లేదా పాల్గొనలేదో తెలుసుకొని బెదిరింపులకు పాల్పడటానికి, కక్షసాధింపు చర్యలు తీసుకోవడానికి అవకాశం కల్పిస్తుంది. ఇది రహస్య ఓటింగ్ అనే దాన్ని అపహాస్యం పాలు చేస్తుంది.

అంతేకాకుండా ఎన్నికల కమిషన్ హిమాచల్ ప్రదేశ్‌తో పాటు గుజరాత్ ఎన్నికల షెడ్యూలును ప్రకటించలేదు. ఇది కచ్చితంగా గుజరాత్‌లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రావడాన్ని జాప్యం చేయడానికి, ఓటర్లను ప్రలోభపెట్టడానికి మరిన్ని ప్రకనలు చేయడానికి,  మరిన్ని 'బహుమానాలు' ఆశ చూపడానికి ప్రధాని మోడీకి మరింత సమయాన్ని అందించడానికే.

**పిఎఫ్ఐ నిషేధం**

పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పిఎఫ్ఐ) అనేది తీవ్రవాద అభిప్రాయాలు కలిగి, తనకు శత్రువులు అనుకున్న వారిపై దౌర్జన్య చర్యలకు పాల్పడే ఒక సంస్థ. పార్టీ ఈ తీవ్రవాద అభిప్రాయాలను నిశితంగా వ్యతిరేకించింది, వారి దౌర్జన్య చర్యలను ఎల్లప్పుడూ ఖండిస్తూ వస్తున్నది.

అయినప్పటికీ ఆ సంస్థను  చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) క్రింద నిషిద్ధ సంస్థగా ప్రకటించడం ఆ సమస్యను ఎదుర్కొనే మార్గం కాదు. ఆరెస్సెస్, మావోయిస్టులు లాంటి సంస్థలపై గతంలో విధించిన నిషేధాలు పనిచేయలేదని అనుభవం చెబుతున్నది. పిఎఫ్ఐ సంస్థ చట్ట వ్యతిరేక చర్యలకు, దౌర్జన్య చర్యలకు ఎప్పుడు పాల్పడినా ప్రస్తుత చట్టాల పరిధిలోనే పటిష్టమైన ఎగ్జిక్యూటివ్ చర్యలు తీసుకోవాలి. దాని ఒంటెత్తువాద, విచ్ఛిన్నకరమైన భావజాలాన్ని ప్రజల్లో ఎండగట్టి రాజకీయంగా ప్రతిఘటించాలి.

ఆరెస్సెస్, పిఎఫ్ఐలు కేరళలోను, తీరప్రాంత కర్నాటకలోను హత్యలు, ప్రతీకార హత్యలకు పాల్పడుతూ మతపరమైన విభజననుతీసుకు వచ్చే లక్ష్యంతో వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాయి. వీటితో పాటు సనాతన సంస్థ, హిందూ జన జాగృతి సమితి లాంటి తీవ్రవాద సంస్థల్లోని శక్తులు ప్రముఖ లౌకికవాద రచయితలు, వ్యక్తులను హత్య చేయడంలో పాల్గొంటున్నాయి.

ఈ తీవ్రవాద సంస్థలు మెజారిటీకి చెందినవైనా, మైనారిటీకి ప్రాతినిధ్యం వహించేవైనా వాటిని ప్రస్తుత చట్టాలను మాత్రమే వినియోగిస్తూ పటిష్టమైన ఎగ్జిక్యూటివ్ చర్యల ద్వారా మాత్రమే ఎదుర్కొనాలి.

**జమ్మూ, కాశ్మీర్**

జమ్మూ, కాశ్మీర్‌లో పరిస్థితి మరింతగా దిగజారిపోతున్నది. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న పచ్చి నిరంకుశ, మతతత్వ విధానాల వల్ల ఈ ప్రాంతంలోని విస్తారమైన ప్రజల్లో తీవ్రమైన అసంతృప్తి నెలకొంటున్నది. నిరంకుశ చట్టాలను దుర్వినియోగం చేయడం, భావ వ్యక్తీకరణను అణచివేయడం, మీడియాపై ఆంక్షలు, శాంతియుత నిరసనలను అనుమతించకపోవడం, యువతీయువకులను విచక్షణారహితంగా అరెస్టు చేయడం వంటి చర్యలతో కాశ్మీర్‌ను పూర్తిగా దిగ్బంధనంలో ఉంచారు.

ఈ ప్రాంత రాజకీయ ముఖచిత్రాన్ని మార్చడానికి కేంద్ర పాలితప్రాంత అధికారవర్గం తీవ్రమైన చర్యలు తీసుకుంటున్నది. పునర్వ్యవస్థీకరణ చట్టం ద్వారా అది రాష్టాలు సర్టిఫికేట్ల స్థానంలో స్వయంపాలిత సర్టిఫికేట్లను ప్రవేశపెట్టింది. దాంతో రాష్ట్రానికి బయట ఉన్న వారికి ఆస్తిహక్కులు, ఓటింగు హక్కులు లభిస్థాయి. భూ చట్టాలకు మార్పులు చేసింది. నియోజక వర్గాల పునర్విభజన కమిషన్ న్యాయవిరుద్ధంగా జమ్మూ, కాశ్మీర్‌లలో నియోజకవర్గాల పునర్విభజనకు భిన్నమైన ప్రమాణాలు పాటించింది. ఆ విధంగా అది కాశ్మీర్ లోయలోనూ, జమ్మూలో ముస్లింలు అధికంగా ఉన్న ప్రాంతాల్లోనూ వెయిటేజి తగ్గించింది. ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణను బిజెపికి ప్రభుత్వం ఏర్పాటు చేసే మెజారిటీ లభించే విధంగా రూపొందిస్తున్నారు.

ప్రభుత్వమే పెట్టుబడులు పెట్టి అభివృద్ధి సాధించడం ద్వారా ఉద్యోగాలు కల్పిస్తుందన్న మాటలు ఒట్టి బూటకాలుగా మారాయి. చివరికి ఈ ప్రాంతంలో ప్రజలకు ప్రధానంగా ఉపాధి కల్పించే పండ్ల తోటల పెంపక రంగం కూడా తీవ్రమైన సంక్షోభంలో పడింది. పండ్ల ధరలు పడిపోవడం, ప్రాథమిక సదుపాయాలు అరకొరగా ఉండడం, పండ్ల లోడ్‌ల ట్రక్కులు జాతీయ రహదారిపై సజావుగా ప్రయాణించడానికి ఆటంకాలేర్పడ్డం వంటి వాటివల్ల సంక్షోభం ఏర్పడింది.

ఇటువంటి పరిస్థితుల్లో ప్రజలు మరింతగా వేర్పాటుకు గురవుతున్నారు. ప్రజలను అణగదొక్కడం వల్ల ఏర్పడిన నిశ్శబ్దంతో పాలనా యంత్రాంగం సంతృప్తి చెందుతున్నప్పటికీ దీర్ఘకాలంలో అది పరిస్థితిని మరింతగా అస్థిరపరిచే వారికీ, ఉగ్రవాదం మరింత పెరగడానికీ తోడ్పడుతుంది. ఇప్పటికే ఈ ప్రాంతంలో కాశ్మీరీ పండిట్లనూ, కూలి పనిచేసుకునేవారినీ లక్ష్యం చేసుకుని హత్యాకాండ జరుగుతున్నది.

మతతత్వ, నిరంకుశ బిజెపికి కాశ్మీర్‌ను వదిలిపెట్టకూడదు. ఈ ప్రజల హక్కుల రక్షణ కోసం లౌకిక, ప్రజాస్వామిక శక్తులు ముందుకు రావాలి.

## లౌకిక ప్రతిపక్ష పార్టీలు: ఇటీవలి పరిణామాలు

**బీహార్:** మన జూలై కేంద్ర కమిటీ సమావేశం జరిగిన కొద్ది రోజుల్లోనే నితిష్ కుమార్ నేతృత్వంలోని జెడియు బిజెపితో పొత్తును వదులుకుని 'మహాసంఘటన'లో చేరింది. నితిష్ కుమార్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన తరువాత ఆర్‌జెడి, కాంగ్రెస్ మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేశారు. ఈ ప్రభుత్వంలో నితిష్ కుమార్ ముఖ్యమంత్రిగా, తేజస్వి యాద్ ఉప ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇందులోకి ఇద్దరు కాంగ్రెస్ మంత్రులకు స్థానం కల్పించారు. ప్రభుత్వం అసెంబ్లీతో తన మెజారిటీని నిరూపించుకుంది. మహాసంఘటనతో అవగాహన కుదుర్చుకుని శాసన సభ ఎన్నికల్లో పోటీ చేసిన వామపక్షాలు ఈ ప్రభుత్వానికి మద్దతు ప్రకటించాయి.

మహారాష్ట్రలో ఉద్దవ్ ఠాకరే నాయకత్వంలోని మహా వికాశ్ అగాది (ఎంవిఎ)ని అస్థిరపరిచి ఏక్‌నాథ్ షిండే ముఖ్యమంత్రిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన బిజెపి ఆ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా చేరింది. ఈ పరిణామం జరిగిన వెంటనే సంభవించిన బీహార్ పరిణామాలు హిందూత్వ మతతత్వ శక్తులపై ఎదురు దాడి చేసేందుకు లౌకిక శక్తులకు మంచి అవకాశంగా లభించాయి.

**తెలంగాణా :** గతంలో ఉన్న శషభిషలన్నిటినీ పక్కనబెట్టి తెలంగాణా రాష్ట్ర సమితి (టిఆర్ఎస్) బిజెపిని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ముందుకొచ్చింది. బిజెపికి వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో కొన్ని లౌకిక పార్టీలను సమీకరించడానికి టిఆర్ఎస్ ముఖ్యమంత్రి చొరవ తీసుకున్నారు. ఇతర పార్టీల్లో ఫిరాయింపులు ప్రోత్సహించి తమ పార్టీలోకి లాక్కోడానికి బిజెపి సిగ్గు విడిచి చేస్తున్న ప్రయత్నాలు కూడా టిఆర్ఎస్ ఈ వైఖరి తీసుకోడానికి ఒక కారణం. జాతీయ స్థాయిలో పాత్ర వహించే ఉద్దేశంతో భారతీయ రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పేరుతో ముఖ్యమంత్రి ఒక జాతీయ పార్టీని ప్రారంభించారు.

సిట్టింగ్ కాంగ్రెస్ ఎంఎల్ఎ బిజెపిలోకి ఫిరాయించడం వల్ల మునుగోడులో ఉప ఎన్నిక వచ్చింది. ఉప ఎన్నిక నవంబరు 3 జరుగుతుంది. టిఆర్ఎస్, బిజెపిల మధ్య ప్రధాన పోటీ ఉంటుంది. బిజెపిని ఓడించడానికి మన పార్టీ, సిపిఐ మద్దతు కావాలని టిఆర్ఎస్ కోరింది. ఇతరత్రా అవగాహన గురించి తరువాతి కాలంలో చర్చించవచ్చు కానీ ఇప్పుడీ ఉప ఎన్నికలో టిఆర్ఎస్‌కు మద్దతివ్వాలని మన పార్టీ రాష్ట్ర కమిటీ నిర్ణయించింది.

**లౌకిక ప్రతిపక్షాల ఐక్యతకు కృషి:** ఈ పరిణామాలతో లౌకిక ప్రతిపక్ష పార్టీల మధ్య చర్చలు సంప్రదింపులు పెరిగాయి. నితిష్ కుమార్ ఢిల్లీ వచ్చి ప్రధాన ప్రతిపక్షాలతో చర్చలు జరిపారు. బిజెపిని ఓడించేందుకు ఐక్యమవ్వాలని ఆయన ప్రతిపాదించారు. ఢిల్లీలో జరిగిన ఎన్‌సిపి జాతీయ సదస్సులో శరద్ పవార్ తిరిగి దాని అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. ఆయన కూడా లౌకిక ప్రతిపక్ష పార్టీల మధ్య ఐక్యతను ప్రతిపాదించారు. దేవీలాల్ జయంత్రి సందర్భంగా ఐఎన్‌ఎల్‌డి నేత ఓం ప్రకాశ్ చౌతాలా హర్యానాలోని ఫతేబాద్‌లో పెద్ద బహిరంగ సభ నిర్వహించారు. దీనికి అనేక మంది జాతీయ పార్టీల నాయకులును ఆహ్వానించారు. వారు సభలో పాల్గొన్నారు.

**కాంగ్రెస్:** రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ కన్యాకుమారి నుండి శ్రీనగర్ వరకు 150 రోజుల పాటు భారత్ జోడో యాత్ర ప్రారంభించింది. దీనికి దక్షిణాది రాష్ట్రాల్లో మంచి స్పందన వస్తోంది. బిజెపి పాలిత రాష్ట్రాల్లోకి ప్రవేశించినప్పుడు దీనికి ఎటువంటి స్పందన వస్తుందో మనం గమనించాల్సి ఉంది. ఇటీవలి కాంలో కాంగ్రెస్ పార్టీలో కనపడిన లుకలుకలు, అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ నాయకులు బిజెపిలోకి చేరిపోయిన నేపథ్యంలో పార్టీని ఐక్య పరిచేందుకూ, ప్రజలతో పార్టీ సంబంధాలను బలపరుచుకోడానికీ ఈ యాత్ర ఉద్దేశించబడినట్లు కనిపిస్తోంది.

రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లిఖార్జున ఖర్గే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. 24 సంవత్సరాల కాలంలో గాంధీ కుటుంబానికి బయటున్న వ్యక్తి కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టడం ఇదే మొదటిసాది.

**సిపిఐ:** 2022 అక్టోబర్ 14 నుండి 18వ తేదీ వరకు సిపిఐ 24వ మహాసభ ఆంధ్ర ప్రదేశ్‌లోని విజయవాడలో జరిగింది. సిపిఐ(ఎం), సిపిఐ–ఎంఎల్ ప్రధాన కార్యదర్శులు శుభాకాంక్షలు తెలిపారు, మహాసభ ప్రారంభ సమావేశానికి హాజరయ్యారు.

## కేరళ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచే యత్నాలు

కేరళ గవర్నర్ ఫెడరలిజంపై తీవ్రమైన దాడి చేస్తూ పాలక బిజెపి రాజకీయ లక్ష్యాలకు అనుగుణంగా ఎల్‌డిఎఫ్ ప్రభుత్వాన్ని అస్థిరపరచడానికి పూనుకున్నారు.

కేరళ ఉన్నత విద్యావ్యవస్థపై ఆయన అక్కసు కక్కడం సరికొత్త పరిణామం. రాష్ట్రంలోని యూనివర్శిటీల చాన్సలర్ హోదాలో ఆయన అన్ని యూనివర్శిటీల గవర్నర్లూ రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర శాసన సభల ఆ విధంగా డిమాండ్ చేసే అధికారం ఆయనకు లేకుండా చట్టం చేసినప్పటికీ దానికి విరుద్ధంగా ఆయన వ్యవహరించారు. కేరళ హైకోర్టు వైస్-చాన్సలర్ల నుండి వివరణ కోరుతూ గవర్నరు ఆదేశంపై తాత్కాలిక స్టే విధించింది. ప్రస్తుతం విషయం న్యాయస్థానం ముందున్నప్పటికీ గవర్నరు చర్య రాజకీయ దురుద్దేశాలతో తీసుకున్నది. ఫాసిస్టు ఆర్ఎస్ఎస్‌కు చెందిన హిందుత్వ సైద్ధాంతిక ఎజెండాను ముందుకు తీసుకుపోయేందుకు గాను కేరళ ఉన్నత విద్యా వ్యవస్థను చేజిక్కించుకునే కుట్ర ఇది.

తరువాత రాష్ట్ర ఆర్థిక మంత్రి రాజీనామా చేయాలని గవర్నరు రాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ రాశారు. రాజ్యాంగం ప్రకారం ఆయకు అలా రాసే అధికారం లేదు. మంత్రివర్గంలోకి ఎవరిని తీసుకోవాలన్న నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేస్తూ ముఖ్యమంత్రి సమాధానం చెప్పారు.

మన రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలనూ, దాని లౌకిక ప్రజాతంత్ర పునాదులనూ గౌరవించేవారంతా ఏకమై రాజ్యాంగ హక్కులను కాపాడుకోవాలి. దురదృష్టమేమంటే, యుడిఎఫ్‌లో భాగస్వాములైన ఐయుఎంఎల్, ఆర్ఎస్‌పిలు గవర్నర్ చర్యలను ఖండించినప్పటికీ కాంగ్రెస్ పార్టీ మాత్రం తటపటాయిస్తోంది.

గవర్నరు ప్రదర్శిస్తున్న ఇటువంటి నగ్నమైన పక్షపాతాన్ని కేరళ ప్రజలు ఐక్యంగా తిప్పికొడతారు. ఎల్‌డిఎఫ్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచే ప్రయత్నాలను ఓడిస్తారు.

## పశ్చిమ బెంగాల్

పశ్చిమ బెంగాల్‌లో మెగా అవినీతి కుంభకోణాలు బయటపడం గురించి, ముఖ్యంగా టిఎంసి ముఖ్య నాయకుడైన పార్థా చటర్జీ అరెస్టు గురించి జులై సిసి సమావేశం పేర్కొన్నది. ఈ పరిణామాలు టిఎంసి ప్రభుత్వం ప్రజాస్వామ్యవ్యతిరేక, పచ్చి అవినీతి పూరిత ప్రభుత్వం అని మనం తీసుకున్న వైఖరిని సమర్థిస్తున్నాయి. టిఎంసి ప్రభుత్వ అస్తవ్యవస్థ పాలన, తీవ్రమైన నేరాలు-అవినీతికి వ్యతిరేకంగా పార్టీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు మిన్నంటుతున్నాయి. భారీగా

జరుగుతున్న నిరసనలపై తీవ్రమై నిర్బంధం సాగుతోంది. కామ్రేడ్స్ ఈ దాడులను ఎదిరిస్తూనే టిఎంసి ప్రభుత్వం, ముఖ్యమంత్రి దుష్పరిపాలనకు వ్యతిరేకంగా మరిన్ని నిరసన కార్యక్రమాలు ఎక్కువ నిర్వహిస్తున్నారు.

తీవ్రమైన కుంభకోణాలు, అవినీతి బయటపడడంతో ప్రజల్లో మమతా బెనర్జీమీద, ఆమె ప్రభుత్వం మీద ఏవగింపు పెరిగింది. దాంతో ఇబ్బందుల్లో పడ్డ మమతా బెనర్జీ ఆర్ఎస్ఎస్ పట్ల, మోడీ పట్ల మెతక వైఖరి అవలంభిస్తున్నారు. ఇటీవల ఒక పత్రికా సమావేశంలో ఆమె "ఆర్ఎస్ఎస్ చెడ్డది కాదు" అని ప్రకటించడంతోబాటు కేంద్ర సంస్థలైన ఇడి, సిబిఐలను దుర్వినియోగం చేయడం వెనుక ప్రధాని తప్పిదం ఏమీ లేదని మరో ప్రకటన చేశారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ప్రతిపక్ష రాజకీయ నాయకునికి మద్దతిస్తానని అంతకు ముందు ప్రకటించిన టిఎంసి ఈ ప్రకటనల తరువాత మడమతిప్పేసి ఓటింగు నుండి గైర్హాజరయింది.

గతంలో కూడా మమతా బెనర్జీ ఆర్ఎస్ఎస్-బిజెపితో చెట్టాపట్టాలు వేసుకున్నారు. వాజ్‌పేయి మంత్రివర్గంలో మంత్రిగా కూడా ఉన్నారు. బిజెపి అండతోనే పశ్చిమ బెంగాల్‌లో టిఎంసి కమ్యూనిస్టు వ్యతిరేక శక్తిగా ఆవిర్భవించింది. టిఎంసిని ఫాసిస్టు వ్యతిరేక పోరాటయోధునిగా చూసే వారికి ఈ పరిణామాలు కళ్లు తెరిపిస్తాయి. పశ్చిమ బెంగాల్‌లో పెరుగుతున్న నిరసన కార్యక్రమాల్లోకి రానురాను మరింత పెద్ద ఎత్తున ప్రజలు వస్తున్నారు. వారు పెద్ద ఎత్తున పోలీసు నిర్బంధాన్ని ఎదుర్కొంటున్నారు. ఈ దుర్మార్గ, అవినీతి-నేరమయ పాలనను అంతం చేసేందుకు, అదే సమయంలో బిజెపి, మతతత్వ శక్తులను వేరుపరిచేందుకు ప్రజాపోరాటాలు మిన్నంటుతున్నాయి.

## త్రిపుర

ఇటీవల పార్టీ ప్రధాన కార్యదర్శి, కామ్రేడ్ ప్రకాశ్ కరత్‌ల సమక్షంలో జరిగిన త్రిపుర పార్టీ కార్యదర్శివర్గం, రాష్ట్ర కమిటీ సమావేశాల నివేదికను గత కేంద్ర కమిటీ సమావేశం చర్చించింది. వీరిద్దరూ ఆగస్టులో జరిగిన ఈ సమావేశాలకు కూడా హాజరయ్యారు. అక్టోబర్ 20న జరిగిన కార్యదర్శివర్గ సమావేశానికి ప్రధాన కార్యదర్శి హాజరయ్యారు. రాష్ట్రంలో పార్టీ స్వతంత్ర కార్యక్రమాలను బలపరచాలనీ, దుర్గా పూజ తరువాత అనేక కార్యకలాపాలు చేపట్టాలని గత కేంద్ర కమిటీ నిర్ణయించింది.

రాష్ట్రంలో ఆగస్టు, సెప్టెంబర్‌లో రెండు మాసాల సుదీర్ఘ క్యాంపెయిన్‌లు నిర్వహించారు. రాష్ట్ర వ్యాపితంగా 200కు పైగా కార్యక్రమాలు జరిగాయి. వీటిలో లక్షకు పైగా ప్రజలు పాల్గొన్నారు. గతంలో ఇటువంటి కార్యక్రమాలు చేయడమే దుర్లభమైన ప్రాంతాల్లో కూడా ఈసారి పాలక బిజెపి సృష్టించిన అడ్డంకులను అదిగమించి కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.

2023 మార్చిలో రాష్ట్ర శాసన సభకు ఎన్నికలు జరుగుతాయి. 2023 జనవరి నాటికి ఓటర్ల జాబితా ఖరారవ్వాల్సి ఉంది.

బిజెపి గూండాలు సృష్టించిన అడ్డంకులను అదిగమించి అక్టోబర్ 21న పార్టీ అగర్తలాలో ఒక పెద్ద బహిరంగ సభ నిర్వహించింది. 60కి పైగా వాహనాలను అగర్తలా చేరుకోకుండా బిజెపి గూండాలు అడ్డుకున్నారు. సభకు వెళుతున్నప్పుడూ, తిరిగి వస్తున్నప్పుడూ అనేక మంది కామ్రేడ్స్‌ను ఈ గూండాలు కొట్టి గాయపరిచారు. అయినప్పటికీ సభలో 40,000 మందివరకు ప్రజలు పాల్గొన్నారు. ఈ సభ పార్టీ బలాన్ని ప్రదర్శించడమే కాకుండా పార్టీ కార్యకర్తల్లోనూ, ప్రజల్లోనూ ఎంతో విశ్వాసం పాదుకొల్పింది.

బిజెపి రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యంపైనా, ప్రజాతంత్ర హక్కులపైనా జరుపుతున్న దాడినీ, అది పాల్పడుతున్న హింసాకాండనూ లౌకిక ప్రతిపక్ష పార్టీలన్నీ ఐక్యంగా ఖండించేట్లు కృషి చేయాలి.

## రానున్న శాసనసభ ఎన్నికలు

ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్‌లో శిగపట్లు హిమాచల్ ప్రదేశ్, గుజరాత్‌లో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపికి సానుకూలంగా మారింది. ఈ రెండు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వాలపై ప్రజలకు తీవ్రమైన అసంతృప్తి నెలకొని ఉంది. అయితే లౌకిక శక్తుల మధ్య అనైక్యతను ఉపయోగించుకుని బిజెపి బయటపడాలనుకుంటున్నది. ఈ రెండు రాష్ట్రాల్లోనూ బిజెపి ప్రచారానికి మోడీ నాయకత్వం వహిస్తున్నారు. మతపరమైన విభనను ఉపయోగించుకోవడం, కేంద్ర ప్రభుత్వ ఖజానాను వాడుకుని 'ఉచితాలు' ఇవ్వడం దాని వ్యూహంగా ఉంది. గుజరాత్ ఎన్నికలను ఎన్నికల కమిషన్ ఆలస్యంగా ప్రకటించడాన్ని అనుకూలంగా వాడుకుని మోడీ ప్రభుత్వ నిధులతో ప్రజలపై 'వ్యక్తిగత వరాలు' కురిపిస్తున్నారు.

ఈ రెండు రాష్ట్రాల్లోనూ ఆప్ తన అభ్యర్థులను నిలిపింది. హిమాచల్ ప్రదేశ్‌లో దానికి బలం లేకపోయినప్పటికీ గుజరాత్ పట్టణ ప్రాంతాల్లో దానికి కొంతమేరకు పట్టు ఉంది.

సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఇతర వామపక్షాలతో ముఖ్యంగా సిపిఐతో కలిసి స్వతంత్రంగా కొన్ని స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయించింది. హిమాచల్ ప్రదేశ్‌లో సిపిఐ(ఎం) 11 స్థానాల్లో పోటీ చేస్తోంది. గుజరాత్‌లో ఎన్నికల షెడ్యూల్ ఇంకా ప్రకటించనందున ఇతర లౌకిక శక్తులతో చర్చలు జరుపుతోంది.

## కేంద్ర కమిటీ పిలుపులు

అన్ని ప్రధాన ప్రజా సంఘాలూ తమ అఖిల భారత మహాసభలు జరిపే పనిలో ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో అఖిల భారత స్థాయిలో నిర్దిష్ట కాలపరిమితితో కూడిన కార్యాచరణ కార్యక్రమానికి పిలుపునివ్వడం సాధ్యం కాదు.

ప్రజల జీవన పరిస్థితులపై పడుతున్న భారాలు, దళితులు, మహిళలు, బలహీన వర్గాలపై పెరుగుతున్న దాడులకు వ్యతిరేకంగానూ, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, ప్రజాతంత్ర హక్కులు, పౌర హక్కులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పార్టీ ఎక్కడికక్కడ స్థానిక పోరాటాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించాలి. గ్రామీణ ఉపాధి హామీ పథకం సక్రమంగా అమలు జరపడం, వేతనాలు సమయానికి చెల్లించడం, డిమాండును బట్టి పనులు కల్పించేట్లు అధికారులపై ఒత్తిడి తేవడం వంటి చర్యలు కూడా ఈ స్థానిక పోరాటాల్లో ఉండాలి.

ప్రజలపై మోపుతున్న దుర్భర పరిస్థితులకు వ్యతిరేకంగా దేశవ్యాపితంగా ట్రేడ్ యూనియన్లు, కిసాన్ సభలు, వ్యవసాయ కార్మిక సంఘాలు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. వీటన్నికీ తలమానికంగా 2023 ఏప్రిల్‌లో 14 నిర్దిష్ట డిమాండ్లతో పార్లమెంటుకు యాత్ర నిర్వహించాలని నిర్ణయించాయి. పార్టీ ఈ వీటికి మద్దతిస్తుంది.

మోడీ ఎన్నికల ప్రచారంలో ప్రజల బాధలు, దుర్భర పరిస్థితులను గురించి ప్రస్తావించకుండా పూర్తిగా ప్రజలను మతపరంగా విడదీసే తన పాత ఆయుధాన్నే వాడుతున్నారు. భారతీయ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న దుస్థితి, తన విధానాల వల్ల ప్రజల జీవితాలు నాశనం అవుతున్న తీరు, భారత జాతీయ వనరుల లూటీ వంటి అంశాల గురించి మాట్లాడ్డానికి మోడీ దగ్గర ఏమీ లేదు. దాంతో ఆయన బద్రీనాద్‌లో

'పూజా' కార్యక్రమం, అయోధ్యలో 2024 జనవరి నాటికి రామాలయ నిర్మాణం పూర్తవుతుందన్న హామీతో అక్కడ తాత్కాలికంగా రామాలయం ఏర్పాటు చేయడం వంటి అంశాలను ప్రచారం చేసుకోవడంలో తీరికలేకుండా ఉంటున్నారు. 2024 ఎన్నికల్లో ఇదే వారికి ప్రచారాయుధం అవుతుంది.

ఇటువంటి పరిస్థితుల్లో హిందూత్వ శక్తులను ఎలా ఎదుర్కోవాలి అన్న అంశంపై మన పార్టీ 23వ మహాసభ నిర్ణయించిన మార్గంలో పార్టీ యావత్తూ చురుకుగా కార్యక్రమాలు చేపట్టడం, చొరవ ప్రదర్శించడం అవసరం. ప్రజల జీవితాలను పక్కనపెట్టేసి, వారి దృష్టిని మళ్లించి 'హిందూత్వ తన గుర్తింపును మరింత విస్తరించుకోకుండా', హిందూత్వ మతతత్వ ఓటు బ్యాంకును బలపరుచుకోకుండా అడ్డుకోవడం కోసం పార్టీ రాజకీయ తీర్మానంలో పేర్కొన్న చర్యలను పట్టుదలతో అమలు చేయాలి.

* * *

**ప్రతులు : 1000**
**ప్రచురణ కాలం : నవంబర్, 2022**
**వెల : ₹ 15/-**

**ప్రచురణ**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్ కమిటీ**
**27-13-3, గవర్నర్‌పేట, విజయవాడ - 2,**
**ఫోన్ నెం. 0866 2577202, 9490099057**